ANN తెలుగు
Follow: @ANNTELUGU
18-10-2026
మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 255 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## అగ్గిమీద గుగ్గిలమైన రాజకీయాలు...
# ఆందోళనకర ప్రకృతి వైపరీత్యాలు

ప్రకృతి పగబట్టిన వేళ... రాజకీయ వేదికలు రణరంగాలైన వేళ... దేశ భవిష్యత్తును మలుపుతిప్పే సంచలన పరిణామాలు తెరవెనుక వేగంగా మారుతున్నాయి. అక్టోబర్ మాసంలోనే హైదరాబాద్ నగరాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అసాధారణ ఎండలు, తెలుగు రాష్ట్రాలను భయపెడుతున్న 'ఎల్ నినో' నీడలు, నీటికష్టాల ముప్పుపై అసలు నిజమేంటి? మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల హడావుడి రక్తసిక్త నామినేషన్ కేంద్రాలుగా మారి, పాత కక్షల 'ఫ్యాక్షన్' మళ్ళీ పడగవిప్పుతోందనే ఆందోళనలను రేకెత్తిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలి వెనుక అసలు కుట్ర కోణాలున్నాయా? ఓట్ చోరీ ఆందోళనల ఆరోపణలు దేశ రాజకీయాల్లో ఎలాంటి భూకంపం సృష్టించబోతున్నాయి? రానున్న రోజుల్లో దేశాన్ని కుదిపేయబోయే సంచలన మార్పుల మర్మమేమిటి?



**తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ -మహాపత్రిక సీఈవో**
**కంది రామచంద్రారెడ్డి**
**వీకెండ్ అనాలసిస్**

టాప్ న్యూస్



ట్రంప్ సంచలన నిర్ణయం రష్యాపై కఠిన ఆంక్షలు ఎత్తివేత భారత్‌కు రిలీఫ్ 02



దసరా వేళ సొంత నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి 02



బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్ 02

# మళ్ళీ యోగినే
## యూపీ సీఎంపై బీజేపీ హైకమాండ్ క్లారిటీ

- ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ సీఎం అభ్యర్థులు మార్పుకు నో
- ఫిబ్రవరి-మార్చిలో అసెంబ్లీ ఎన్నికలు
- 2017 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం



**ఢిల్లీ, మహా :** అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రులను మారుస్తూ వ్యతిరేకత తగ్గించుకునూ వ్యూహాన్ని అవలంభిస్తున్న బీజేపీ హైకమాండ్ ఉత్తరప్రదేశ్ లో మాత్రం యోగి పాపులారిటీనే గెలుపుమంత్రంగా భావిస్తోంది. రానున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ప్రస్తుత ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, పుష్కర్ సింగ్ ధామి నేతృత్వంలోనే పార్టీ ఎన్నికల బరిలోకి దిగాలని నిశ్చయించినట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే బీజేపీ కేంద్ర నాయకత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ నిర్ణయం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని బీజేపీ వర్గాలంటున్నాయి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వానికి, ఢిల్లీలోని కేంద్ర నాయకత్వానికి మధ్య సమన్వయ లోపం, విభేదాలు ఉన్నాయని ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ గత కొంతకాలంగా విమర్శలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, యోగి నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయించడం ద్వారా, పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, ప్రస్తుత నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని బలమైన సంకేతాలను పంపినట్లయింది. 2017 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 403 స్థానాలకుగాను 300కు పైగా సీట్లు సాధించి బీజేపీ ప్రభంజనం సృష్టించగా, యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత 2022 ఎన్నికల్లోనూ 255 స్థానాలతో బీజేపీ తన అధికారాన్ని నిలబెట్టుకుంది. అయితే, ఇటీవలి 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో

మిగతా 2వ పేజీలో



దాండియా వేడుకల్లో
# ఘోర ప్రమాదం

ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అపశృతి

- లైటింగ్ సిస్టమ్ కూలిపడి విద్యార్థిని మృతి
- మరో 25 మందికిపైగా విద్యార్థులకు గాయాలు
- విద్యార్థిని మృతి చెందిన ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ దిగ్భ్రాంతి

**రంగారెడ్డి జిల్లా, మహా :** రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో దాండియా వేడుకలో విషాదం చోటుచేసుకుంది. లైటింగ్ సిస్టమ్ కూలిపడి విద్యార్థిని మృతి చెందింది. 25 మంది విద్యార్థినులకు గాయాలయ్యాయి. నాదర్‌గుల్ లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన దాండియా వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులకు ఈవెంట్ కోసం ఏర్పాటు చేసిన లైటింగ్ క్రేన్ కూలిపడటం తో 25 మందికి పైగా విద్యార్థులు గాయపడినట్లు సమాచారం. వేడుకల సందర్భంగా విద్యార్థినులు,విద్యార్థులకు వేర్వేరుగా ఏర్పాట్లు చేయగా, లైటింగ్ క్రేన్ విద్యార్థినుల వైపు కూలిపడటం తో పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులను తొలుత ప్రత్యూష ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కామినేని,ఓవైసీ ఆస్పత్రులకు తరలించారు. చికిత్స పొందుతూ ఒక విద్యార్థిని మృతి చెందింది. ప్రమాద విషయం తెలుసుకున్న

మిగతా 2వ పేజీలో

## యువ దర్శకుల సృజనాత్మకత సమాజంలో చైతన్యం నింపాలి 04

- వినోదంతో పాటు సామాజిక సందేశాలిచ్చే లఘు చిత్రాలను రూపొందించాలి
- హైదరాబాద్‌ను భారతీయ చిత్ర పరిశ్రమకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపు



## టీడీపీ మూడో జాబితా విడుదల

- గుంటూరు మేయర్ అభ్యర్థిగా లక్ష్మీ అపర్ణ
- ఒంగోలు కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా నల్లమల్లి శ్రీ శిల్ప

02



## దసరా వేళ హైదరాబాద్ నుంచి పల్లెబాట 02

- విజయవాడ హైవేపై వాహనాల రద్దీ
- పంతంగి టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు



కోల్‌కతా దుర్గాపూజా
## పండల్‌లో పెను విషాదం
తొక్కిసలాటలో 17 మంది దుర్మరణం 02









# దాండియా వేడుకల్లో ఘోర ప్రమాదం

( మొదటి పేజీ తరువాయి )

బీజేపీ నాయకుడు అందెల శ్రీరాములు ఆస్పత్రికి వెళ్లి గాయపడిన విద్యార్థులను పరామర్శించారు.

**విద్యార్థిని మృతి చెందిన ఘటనపై సీఎం దిగ్భ్రాంతి**

నాదర్‌గుల్‌లో విద్యార్థిని మృతి చెందిన ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థి కుటుంబానికి సానుభూతి తెలిపారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశించారు. ప్రమాదానికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**దుర్ఘటన పై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దిగ్భ్రాంతి**

నాదర్‌గుల్ ఇంజినీరింగ్ కాలేజీ ఘటన అత్యంత విషాదకరం.. ఈ సంఘటనలో విద్యార్థి మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సంతాపం ప్రకటించారు. హైదరాబాద్ నాదర్ గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన విషాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కాలేజీలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం సందర్భంగా జరిగిన ప్రమాద ఘటనలో విద్యార్థి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. విద్యార్థి కుటుంబానికి తీరని లోటు ఏర్పడిందని, వారి ఆవేదనను మాటల్లో చెప్పలేమని అన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు వారికి ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానన్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించి, వారు త్వరగా కోలుకునేలా ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యం అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి కార్యక్రమంలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

# అద్వాణీకి అస్వస్థత..

- ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స
- ప్రస్తుతం నిలకడగా ఆరోగ్యం
- అక్టోబర్ 7న నివాసంలో మోదీ పరామర్శ..
- తొమ్మిది రోజులకే ఆసుపత్రిలో చేరిన బీజేపీ అగ్రనేత



**న్యూఢిల్లీ, మహా :** బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వాణీ (98) ఛాతీ నొప్పితో ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేరారు. శుక్రవారం సాయంత్రం ఆయనను ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం పల్మనాలజీ విభాగంలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

**ఈ ఏడాది మేలోనూ ఆసుపత్రిలో చేరిక.**

వయో సంబంధిత ఆరోగ్య సమస్యల కారణంగా అద్వాణీ ఈ ఏడాది మేలోనూ ఆసుపత్రిలో చేరారు. చికిత్స అనంతరం కొన్ని రోజులకే డిశ్చార్జి అయ్యారు. 2024లోనూ ఆయన పలుమార్లు ఆసుపత్రిలో చికిత్స పొందారు. అదే ఏడాది డిసెంబరులో వైద్య పర్యవేక్షణలో ఉంచిన అనంతరం డిసెంబర్ 25న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. తాజా అనారోగ్యానికి సంబంధించి మరిన్ని వైద్య వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

తొమ్మిది రోజుల క్రితమే అద్వాణీని కలిసిన మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అక్టోబర్ 7న ఢిల్లీలోని అద్వాణీ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అద్వాణీ ఆశీస్సులు తీసుకున్నారు. 2001 అక్టోబర్ 7న మోదీ తొలిసారిగా గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అద్వాణీ దశాబ్దాల ప్రజాసేవ దేశంపై చెరగని ముద్ర వేసిందని మోదీ అప్పట్లో పేర్కొన్నారు.

**బీజేపీ ఎదుగుదలలో కీలక పాత్ర**

1927లో అప్పటి బ్రిటిష్ ఇండియాలోని కరాచీలో జన్మించిన అద్వాణీ.. దేశ విభజన సమయంలో 1947లో భారత్‌కు వలస వచ్చారు. బీజేపీ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన ఆయన మూడు సార్లు పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2002 నుంచి 2004 వరకు ఉప ప్రధానిగా పనిచేశారు. ప్రజాసేవకు గుర్తింపుగా 2024 మార్చిలో ఆయనకు భారత అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానం చేశారు.

# మళ్ళీ యోగినే

( మొదటి పేజీ తరువాయి )

బీజేపీ ప్రదర్శన కొంత నిరాశపరిచింది. 2019లో 62 ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్న పార్టీ, ఈసారి కేవలం 33 స్థానాలకే పరిమితమైంది. ఈ ఫలితాల అనంతరం రాష్ట్ర నాయకత్వం మార్పుపై చర్చలు జరిగినప్పటికీ, అధిష్ఠానం మాత్రం యోగి వైపే మొగ్గు చూపడం గమనార్హం.

**ఉత్తరాఖండ్ సీఎంకు మద్దతు**

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామికి పార్టీ అధిష్ఠానం నుంచి పూర్తిస్థాయి మద్దతు లభించింది. 2021 నుంచి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న ఆయన, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాలతో పార్టీని విజయతీరాలకు చేర్చారు. వీటికి తోడు, 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ రాష్ట్రంలోని మొత్తం ఐదు స్థానాలను బీజేపీ వరుసగా మూడోసారి క్లీన్‌స్వీప్ చేసింది. ఈ వరుస విజయాలు ధామి నాయకత్వాన్ని పార్టీలో మరింత సుస్థిరం చేశాయి. తాజా నిర్ణయాలతో రెండు కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నాటికి నాయకత్వంపై నెలకొన్న సందిగ్ధతకు బీజేపీ అధిష్ఠానం తెరదించింది. ముందుగానే నాయకత్వ ముఖచిత్రాలను ప్రకటించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో స్పష్టతనిస్తూ, ఎన్నికల ప్రచారంలోకి దూసుకెళ్లేందుకు బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.



## ట్రంప్ సంచలన నిర్ణయం
# రష్యాపై కఠిన ఆంక్షలు ఎత్తివేత

- భారత్‌కు రిలీఫ్
- అమెరికా మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ట్రంప్ డెసిషన్



**మహా** : ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. రష్యాపై విధించిన కఠిన ఆంక్షలు, సుంకాలను ఎత్తివేశారు. నవంబర్ 3న జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో దేశంలో ఆకాశాన్నంటిన డీజిల్ ధరలను కిందికి దించేందుకు ట్రంప్ ఈ వ్యూహాత్మక అడుగు వేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో తాను జరిపిన చర్చలు సఫలమయ్యాయని, ఫలితంగా రష్యా నుంచి తక్షణమే 3 లక్షల టన్నుల డీజిల్‌ను అమెరికా కొనుగోలు చేయనుందని ట్రంప్ వెల్లడించారు. నవంబర్, ఆ తర్వాతి నెలల్లోనూ ఈ సరఫరా కొనసాగుతుందని తెలిపారు. రైతులు, ట్రక్ డ్రైవర్లకు ఇంధన భారాన్ని తగ్గించడమే తన తొలి ప్రాధాన్యమని, ఈ ఒప్పందంతో అమెరికాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా డీజిల్ ధరలు రికార్డు స్థాయిలో పడిపోతాయని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. అయితే, ఇటీవల రష్యాతో ట్రంప్ కుదుర్చుకున్న ఒప్పందంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఓవైపు రష్యా చమురు దిగుమతులు చేసుకునే దేశాలపై సుంకాలు విధించేలా చట్టం తెచ్చి, మరోవైపు అగ్రరాజ్యమే రష్యాతో డీల్ కుదుర్చుకోవడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆంక్షల చట్టంలో మినహాయింపులు కల్పిస్తూ ట్రంప్ చేసిన తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ట్రంప్ నిర్ణయం భారత్‌కు పెద్ద ఊరటనిచ్చింది. ఈ మినహాయింపులతో భారత్‌పై ఆ వాణిజ్య యుద్ధం, ఆంక్షల ముప్పు ప్రస్తుతానికి తప్పినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా ఆంక్షల భయం లేకుండా రష్యా నుంచి చౌకగా చమురు కొనుగోలు చేసేందుకు భారత్‌కు మరింత స్వేచ్ఛ లభించింది.

**వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీని పదవి నుంచి తొలగించిన ట్రంప్**

దీంతో పాటు ట్రంప్ మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నారు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కేటీ జకారియా పనితీరుపై విమర్శలు, విద్యార్హతపై ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో ఆమెను ఆ పదవి నుంచి తప్పించారు. కాగా బాధ్యతలు చేపట్టిన ఐదు రోజులకే ఆమెను పదవి నుంచి తొలగించడం గమనార్హం. అక్టోబర్ 12న శ్వేతసౌధ మీడియా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన జకారియా ఓ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆ సమయంలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడంలో తడబడ్డారు. దీంతో ఆ సమావేశం 15 నిమిషాల్లో ముగిసింది. దీంతో జకారియా పనితీరుపై విమర్శలు వెలువడ్డాయి. గతంలో ఆమె న్యాయవాదిగా పనిచేశానని చెప్పడం కూడా విమర్శలకు తావిచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో పదవిలో కొనసాగాలా? వద్దా? అనేది జకారియానే నిర్ణయించుకోవాలని ట్రంప్ సూచించారు. అలా చెప్పిన కొన్ని గంటలకే ఆమెను పదవి నుంచి తొలగిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.

**'ఇజ్రాయెల్ సాయాన్ని సౌదీ స్వీకరించాలి'**

ఇక, ఇటీవల సౌదీ అరేబియాపై వరుసగా హూతీలు చేస్తున్న దాడులు తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందిస్తూ, హూతీ దళాల నుంచి ఎదురవుతున్న దాడులను తిప్పికొట్టేందుకు ఇజ్రాయెల్ సాయాన్ని స్వీకరించాలని ట్రంప్ పేర్కొన్నారు. హూతీలు చేస్తున్న క్షిపణి, డ్రోన్ దాడులను దీటుగా ఎదుర్కొనేందుకు ఇజ్రాయెల్ అందించే తోడ్పాటు సౌదీకి చాలా సహాయకరంగా ఉంటుందని చెప్పారు. అలాగే, ఇజ్రాయెల్‌తో పాటు పలు అరబ్ దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు కుదిరిన ఒప్పందాల శ్రేణి అబ్రహం అకార్డ్స్ (2020) ఫ్రేమ్‌వర్క్‌లో సౌదీ అరేబియా కూడా చేరే అవకాశం ఉందని ట్రంప్ స్పష్టం చేశారు. మరోవైపు, మంగళవారం ఇజ్రాయెల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాట్లాడారు. సౌదీ అరేబియా ఇజ్రాయెల్ సహాయాన్ని కోరిందా? అని విలేకరులు అడగ్గా, "మమ్మల్ని సహాయం అడగని పశ్చిమాసియా దేశాలు దాదాపుగా లేవు" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, సౌదీ అరేబియాపై హూతీ చేస్తున్న దాడుల్లో తమ ప్రమేయమేమి లేదని ఇరాన్ చెబుతోంది. అంతేకాదు, ఇరుపక్షాల మధ్య విభేదాలను పరిష్కరించంలో సహాయపడటానికి తాము సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది.

# టీడీపీ మూడో జాబితా విడుదల

- గుంటూరు మేయర్ అభ్యర్థిగా లక్ష్మీ అపర్ణ
- ఒంగోలు కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా నల్లమల్లి శ్రీ శిల్ప



**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. పురపోరులో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను ఖరారు చేస్తున్న ఆ పార్టీ, శనివారం నాడు మూడో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో రెండు కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను, 10 మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్ అభ్యర్థులను ప్రకటించింది. తాజా జాబితా ప్రకారం, కీలకమైన గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, ఒంగోలు కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా నల్లమల్లి శ్రీ శిల్ప పేరును టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసింది.

10 మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్ అభ్యర్థులు

ఈ జాబితాలో 10 మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్ అభ్యర్థులను కూడా పార్టీ ప్రకటించింది. ఆ వివరాలు కింద ఉన్నాయి:

**చీమకుర్తి: సిద్ధా సుధాకర్**
**కనిగిరి: అచ్చాల తిరుపతమ్మ**
**మండపేట: వేగుళ్ల అజయ్ కుమార్**
**నూజివీడు: బర్రె ఇళయరాజా**
**పలమనేరు: సి. రాజ్యలక్ష్మి**
**పార్వతీపురం: బెలగాం కరుణ**
**పిడుగురాళ్ల: షేక్ బాబావలి**
**పుంగనూరు: నయీమా తాజ్**
**సత్తెనపల్లి: మారెళ్ల రామాంజనేయులు**
**వినుకొండ: చెరుకుంపాలెం షమీమ్ ఖాన్**

ఇప్పటివరకు 70 స్థానాలు ఖరారు

తాజా జాబితాతో కలిపి టీడీపీ ఇప్పటివరకు మూడు విడతల్లో అభ్యర్థులను ప్రకటించింది. మొత్తం మీద 10 కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను, 60 మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్ అభ్యర్థులను పార్టీ ఖరారు చేసింది. మిగిలిన స్థానాలకు కూడా త్వరలోనే అభ్యర్థులను ప్రకటించేందుకు కసరత్తు ముమ్మరం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# దసరా వేళ హైదరాబాద్ నుంచి పల్లెబాట

విజయవాడ హైవేపై వాహనాల రద్దీ

పంతంగి టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

హైదరాబాద్, మహా : దసరా పండుగ సెలవులు, వారాంతం ఒకేసారి రావడంతో హైదరాబాద్ నగరం నుంచి సొంత ఊళ్లకు బయలుదేరిన ప్రయాణికులతో రహదారులు కిక్కిరిసిపోయాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని జాతీయ రహదారి 65 (హైదరాబాద్ విజయవాడ) పై వాహనాల రద్దీ ఊహించని స్థాయిలో పెరిగింది. పంతంగి టోల్‌ప్లాజా సమీపంలో కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్ వైపు నుంచి విజయవాడ వైపు ప్రయాణించే వాహనాల రాకపోకలు నెమ్మదించడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ భారీ ట్రాఫిక్ జామ్‌కు కేవలం వాహనాల సంఖ్య పెరగడమే కాకుండా, టోల్‌ప్లాజా వద్ద ఎదురవుతున్న సాంకేతిక లోపాలు కూడా ప్రధాన కారణమయ్యాయి. అనేక వాహనాల్లో ఫాస్టాగ్ బ్యాలెన్స్ లేకపోవడం, కొన్ని చోట్ల ఫాస్టాగ్ స్కానర్లు సరిగ్గా పనిచేయక సాంకేతిక సమస్యలు తలెత్తడంతో టోల్ గేట్ల వద్ద ఒక్కో వాహనం దాటడానికి ఎక్కువ సమయం పడుతోంది. ఫలితంగా టోల్ ప్లాజా ముందు వరుసగా వాహనాలు నిలిచిపోయి కిలోమీటర్ల కొద్దీ



జామయ్యాయి. ఇక ఈ హైవేపై ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులు కూడా ఇబ్బందికరంగా మారాయి. చాలా చోట్ల పనులు జరుగుతుండటంతో వాహనాలు చాలా నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి.

**ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాల మళ్లింపు**

రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోవడంతో రంగంలోకి దిగిన ట్రాఫిక్ పోలీసులు తక్షణ ఉపశమన చర్యలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, సూర్యాపేట వైపు వెళ్లే వాహనాల తాకిడిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తెచ్చారు. లక్కారం గ్రామం వద్ద నుంచి వలిగొండ మీదుగా చిట్యాల చేరుకునేలా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ప్రయాణికులు, వాహనదారులు తొందరపడకుండా పోలీసు సిబ్బంది సూచనలను పాటించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా టోల్‌ప్లాజాల వద్ద సమయం వృథా కాకుండా ఉండటానికి ముందస్తుగానే ఫాస్టాగ్ ఖాతాల్లో తగినంత బ్యాలెన్స్ ఉంచుకోవాలని వీలైనంత వరకు వేగంగా టోల్ గేట్లను దాటేందుకు సహకరించాలని కోరారు.

**బస్టాండ్లలో రద్దీ**

పండగ ప్రయాణికుల రద్దీతో హైదరాబాద్ నగరంలోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్ లో రద్దీ భారీగా పెరిగింది. ఇవాళ, రేపు భారీగా ప్రయాణాలు ఉంటాయని ఆర్టీసీ అంచనా వేస్తోంది. అందుకు తగ్గట్లు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఉప్పల్ నుంచి వరంగల్ వైపు వెళ్లే రూట్‌లోనూ రద్దీ క్రమంగా పెరుగుతోంది. వాహనాల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. భువనగిరి సమీపంలోని టోల్ గేట్ వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. రాబోయే రెండు మూడు రోజుల్లో మరింత రద్దీ ఉండే అవకాశం ఉంది.

# విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధా

**జనసేన అభ్యర్థుల తొలి జాబితా విడుదల**

విజయవాడ. మహా : స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి జనసేన పార్టీ పూర్తిస్థాయిలో సమాయత్తమవుతోంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీ ఎన్నికల్లో పార్టీ తరఫున రేసులో నిలబడే అభ్యర్థుల తొలి జాబితాను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఖరారు చేశారు. పార్టీ సీనియర్ నాయకులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం గెలుపే ప్రామాణికంగా ప్రజాదరణ పొందిన నాయకులకు ఈ జాబితాలో స్థానం కల్పిస్తూ ఆమోదం తెలిపారు.

ఈ తొలి విడత జాబితాలో రెండు ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 ముఖ్యమైన మున్సిపాలిటీలకు అభ్యర్థులను ప్రకటించారు.

కార్పొరేషన్ల మేయర్/ అభ్యర్థులు:

**ఏలూరు కార్పొరేషన్: రెడ్డి అప్పలనాయుడు**
**విజయవాడ కార్పొరేషన్: వంగవీటి రాధాకృష్ణ**

**మున్సిపాలిటీల అభ్యర్థుల వివరాలు:**

**అమలాపురం : నల్లా శ్రీధర్**
**చిలకలూరిపేట : తోట రాజరాజేశ్వరి**
**గొల్లప్రోలు: కదారి తమ్మయ్య నాయుడు**
**నరసాపురం: కొత్తపల్లి శైలజ**
**నిడదవోలు: కల్లం జ్యోతి**
**పెడన: మట్టా శివపావని**
**పిఠాపురం: డాక్టర్ బీరా విజయ్ శేఖర్**
**పుత్తూరు: డి. ఏలుమలై**
**సాలూరు: గొర్లె విజయకుమారి**
**సామర్లకోట: పిట్టా జానకి రామారావు**
**తెనాలి: తోటకూర వెంకట రమణారావు**
**తిరువూరు: పి. మాధవి**



మహిళలకు, స్థానికంగా ప్రజా సమస్యలపై పోరాడే నాయకులకు ఈ తొలి జాబితాలో పెద్దపీట వేశామని జనసేన పార్టీ వర్గాలు తెలిపాయి. త్వరలోనే మిగిలిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు సంబంధించి రెండవ జాబితాను కూడా విడుదల చేస్తామని పార్టీ ప్రతినిధులు వెల్లడించారు.



## దసరా వేళ ..సొంత నియోజకవర్గానికి
# సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్, మహా : దసరా పండుగ వేళ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో పర్యటించనున్నారు. ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలను కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. సొంత నియోజకవర్గ ప్రజలతో పండుగ వేళ సీఎం మమేకం కానుండటంతో ఈ పర్యటనపై ఆసక్తి నెలకొంది.

# కోల్‌కతా దుర్గా పూజా పండల్‌లో పెను విషాదం

**..తొక్కిసలాటలో 17 మంది దుర్మరణం**

మహా : ఉత్తర కోల్‌కతాలోని అత్యంత ప్రసిద్ధ చోర్‌బాగన్ సార్వజనీన్ దుర్గాపూజా పండల్ వద్ద శనివారం రాత్రి జరిగిన తీవ్ర తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ విషాద సంఘటనలో కనీసం 17 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తుంది. మరో 25 మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తుంది. అమ్మవారి దర్శనం కోసం వేలాది మంది భక్తులు పోటెత్తిన సమయంలో ఆకస్మికంగా కురిసిన భారీ వర్షం వల్ల ప్రజలు తలదాచుకునేందుకు ఒక్కసారిగా పరుగులు తీశారు. ఈ క్రమంలో తోపులాట జరిగి కిందపడిపోయిన వారిని వెనుక నుంచి దూసుకొచ్చిన రద్దీ తొక్కుకుంటూ వెళ్లడంతో ఈ ఘోర ప్రమాదం సంభవించింది. కింద పడిపోయిన వారు ఊపిరాడక, బలమైన గాయాలు కావడంతో పలువురు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, క్షతగాత్రులను వెంటనే కలకత్తా మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించి మెరుగైన అత్యవసర చికిత్స అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా ఆసుపత్రిని సందర్శించి బాధితులను పరామర్శించడంతో పాటు సహాయక చర్యలను పర్యవేక్షించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్, భారీగా పోలీసు బలగాలు రంగంలోకి దిగాయి. భద్రతా కారణాల దృష్ట్యా చోర్‌బాగన్ పండల్‌ను అధికారులు పూర్తిగా మూసివేశారు. పండుగ పూట ఇంతమంది భక్తులు ప్రాణాలు కోల్పోవడంతో నగరవ్యాప్తంగా విషాద ఛాయలు అలముకున్నాయి.



# బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్

**హైదరాబాద్, మహా** : బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు అలవాటు పడిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. బీజేపీ విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రతిసారీ విదేశీ శక్తులను తెరపైకి తెస్తోందని మండిపడ్డారు. చైనా భూఆక్రమణపై మాట్లాడే దమ్ము మోదీకి లేదన్నారు. రోహింగ్యాల పేరుతో దేశ ప్రజల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. దొరికితే దొంగ అన్నట్లుంది బీజేపీ తీరు అంటూ మండిపడ్డారు. ఈడీ దాడులు కేవలం ప్రతిపక్ష పార్టీ నేతలపైనే ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. ఎన్నిక పక్రియ నిబంధనలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎందుకు మార్చారని, కమిటీలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఎందుకు తొలగించారని పీసీసీ చీఫ్ నిలదీశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ ఎన్నికైన రోజే ప్రమాదాన్ని గురించి రాహుల్ గాంధీ హెచ్చరించారని గుర్తుచేశారు. 'మీరు ప్రజల మద్దతుతో గెలవలేరు.. అందుకే ఓటు దొంగతనానికి పాల్పడ్డారు' అంటూ బీజేపీపై విరుచుకుపడ్డారు. పెద్ద రాష్ట్రాలలో ఓట్ల దొంగతనం ఎక్కువగా జరుగుతోందని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సీపీఎం మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నామని మహేశ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో సీపీఎం కలసి పనిచేస్తోందని చెప్పారు. ఇండియా కూటమిలోని అన్ని పార్టీల మద్దతు కూడగడతామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## పేద విద్యార్థుల ఉన్నతకి ఆర్థిక చేయూత

**ఉపకార వేతన చెక్కులు పంపిణీ చేసిన కమ్మ మహాజన సేవా సంఘం**

**మణుగూరు, మహా :** పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు తెలంగాణ కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య సహకారంతో మణుగూరు కమ్మ మహాజన సేవా సంఘం ఆధ్వర్యంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఉపకార వేతన చెక్కులను పంపిణీ చేశారు. 8 మంది విద్యార్థులకు గాను రూ.90 వేల విలువ కలిగిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యతోనే కుటుంబ, సామాజిక అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదివి జీవితంలో స్థిరపడాలని సూచించారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతనందిస్తున్న తెలంగాణ కమ్మవారి సేవా సంఘాల సమాఖ్యకు, సమాఖ్య అధ్యక్షుడు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ అర్హులైన పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని ఆకాంక్షించారు. ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు మాట్లాడుతూ తమ చదువులకు ఆర్థికంగా ప్రోత్సాహం అందించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు, స్థానిక సంఘం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత చదువులు పూర్తి చేసి సమాజంలో ఆదర్శంగా నిలుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మణుగూరు కమ్మ మహాజన సేవా సంఘం అధ్యక్షుడు ఉప్పలపాటి వెంకట రాంబాబు, ప్రధాన కార్యదర్శి తోటకూరి సతీష్ కుమార్, కోశాధికారి మానుకొండ ఉమాకర్, దండా రాధాకృష్ణ, పుచ్చకాయల శంకర్, పొశం భాస్కర్, యలమాటి పూర్ణ, కరివేద వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ వారోత్సవాలు ఆడంబరం.. అమలు అట్టడుగు.!

- మంచిర్యాల జిల్లాలో నీరుగారుతున్న సమాచార హక్కు చట్టం..
- కలెక్టర్ కార్యాలయం వివిధ శాఖలలో బోర్డులు కరువు.!

**మంచిర్యాల, మహా ప్రతినిధి :** దేశవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) వారోత్సవాలు అక్టోబర్ 5 నుంచి 12 ముగిసినా, మంచిర్యాల జిల్లాలో మాత్రం చట్టం అమలు తీరు కనుచూపుమేరలో కానరావడం లేదు. ప్రజలకు, అధికారులకు అవగాహన కల్పించాల్సిన జిల్లా యంత్రాంగం ఆ దిశగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆడంబరంగా వారోత్సవాలు ముగిసినా, జిల్లాలో ఆర్టీఐ చట్టం అమలు 'అడుగు ముందుకు ఆరు అడుగులు వెనక్కు' అన్న చందంగా తయారైంది.

**కలెక్టర్ కార్యాలయంలోకరువైన ఆర్టీఐ బోర్డులు.!**
జిల్లా కలెక్టర్ ప్రధాన కార్యాలయంలోనే చట్ట ప్రకారం ఏర్పాటు చేయాల్సిన ఆర్టీఐ సమాచార బోర్డులు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ల వివరాలతో దర్శనమివ్వకపోవడం గమనార్హం. జిల్లా ప్రధాన కార్యాలయ పరిస్థితే ఇలా ఉంటే, మండల స్థాయి ఎంపీడీవో, మున్సిపల్, ఎంఈఓ, రెవెన్యూ కార్యాలయాల్లో చట్టం ఏ రీతిలో అమలవుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ప్రతి ప్రభుత్వ శాఖలో ప్రజలకు పారదర్శక సమాచారం అందించడంలో జిల్లా అధికారులు తీవ్రంగా విఫలమవుతున్నారని సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సమాచారం ఇవ్వనీకి 25 వేల కట్టించుకుని..చివరికి పోలీస్ కేసు.!**
ఆర్టీఐ చట్టం పట్ల అధికారుల నిర్లక్ష్యానికి జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారే ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచారు. జిల్లాలోని వివిధ శాఖల్లో కాంట్రాక్ట్/ఒప్పంద ప్రాతిపదికన ఎంతమంది కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు..?, వారి ఏజెన్సీల వివరాలేమిటి..? అని ఒక దరఖాస్తుదారుడు సమాచారం కోరగా, సదరు అధికారి జిరాక్స్ ఖర్చుల పేరిట ఏకంగా 25,000 రూపాయలు కట్టాలని నోటీస్ జారీ చేసినట్లు సమాచారం. చివరికి బాధితుడు చేసేది ఏమీ లేక 25 వేల రూపాయల డీడీ తీసి పంపించినప్పటికీ సదరు జిల్లా అధికారి సమాచారం ఇవ్వకపోవడంతో విసుగుచెందిన దరఖాస్తుదారుడు చివరికి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి, సదరు అధికారిపై కేసు నమోదు చేయించిన దుస్థితి నెలకొంది.

**చెన్నూర్ రెవెన్యూ అధికారి అక్రమాలు..!?**
గతంలో చెన్నూర్ మండల తహసీల్దార్‌గా, ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఒక అధికారి అక్రమంగా ఇంటి నంబర్ల కేటాయింపుకు తెరతీశారు. ఈ అంశంపై పలు దినపత్రికలలో కథనాలు రావడంతో సదరు ఇంటి నంబర్లను ఆన్‌లైన్ నుండి తొలగించి, కట్టిన ఇళ్లను కూల్చివేశారు. అయితే, ఏ జీవో ఆధారంగా అక్రమంగా ఇంటి నంబర్లు కేటాయించారు.?, మళ్లీ ఏ నిబంధనల ప్రకారం తొలగించి, ఇళ్లను కూల్చేశారు.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పేద ప్రజలకు అన్యాయం చేసి వివాదాస్పదమైన సదరు అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సింది పోయి, ఆయనను జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోనే విధులు నిర్వహించేలా ఆశ్రయం కల్పించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, జిల్లా కలెక్టర్లు ఈ వ్యవహారంపై స్పందించకపోవడం గమనార్హం.

**సస్పెండ్ అయినా మళ్లీ కమిషనర్ పీఠం.! నేడు విజిలెన్స్ ఎంక్వయిరీ**
గతంలో నస్పూర్ మున్సిపాలిటీలో ఇన్చార్జి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ, లీవ్‌లో ఉండి కూడా అక్రమంగా ఇంటి అనుమతులు ఇచ్చి సస్పెండ్ అయిన ఒక అధికారికి మళ్లీ బెల్లంపల్లి గ్రేడ్2 మున్సిపల్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. ఆయనపై మళ్లీ ఫిర్యాదులు రావడంతో జిల్లా కలెక్టర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌ను విచారణాధికారిగా నియమించినట్లు తెలుస్తోంది. సబ్ కలెక్టర్ విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో హైదరాబాద్ సీడీఎంఏ విజిలెన్స్ విచారణను వరంగల్ ఆర్‌డీఎంఏకి అప్పగించినట్లు సమాచారం. ఈ రోజు (17 అక్టోబర్ 2026, శనివారం) ఉదయం 11:00 గంటలకు విజిలెన్స్ ఎంక్వయిరీ జరగనుంది.

**అభివృద్ధి పనుల్లో కమీషన్ల కక్కుర్తి.!?**
మండలాలు, మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేయడంలో ఇంజనీర్లు తీవ్ర అశ్రద్ధ చూపుతున్నట్లు తెలుస్తోంది. చాలామంది కాంట్రాక్టర్లు నాణ్యతా లోపాలకు శ్రీకారం చుడుతున్నారు. కాంట్రాక్టర్లు పనులను పంచుకుంటూ అధికారులకు నజరానాలు అందిస్తున్నారనే ఆరోపణలు జిల్లాలో వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది అధికారులు కమిషన్ల కక్కుర్తితో పైస్థాయి అధికారులను సైతం ఇబ్బందుల్లోకి నెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రభుత్వ యంత్రాంగం స్పందించాలి.!**
ఒకవైపు అక్రమ భూపట్టాల బదలాయింపులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరుగుతుంటే, వివరాలు అడిగిన ప్రజలకు సమాచారం మా వద్ద లేదు అని నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారు. ఆర్టీఐ చట్టం నిర్వీర్యం అవుతుండటంపై స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ బోర్డులు ఏర్పాటు చేసి నిర్ణీత వ్యవధిలో సమాచారం ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన సమాచార హక్కు చట్టాన్ని కాపాడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.




# డీసీసీ అధ్యక్షుడి నివాసంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

- జాతీయ స్థాయి మోడల్ రాకెట్రీ ఫైనల్స్ కు రాకెట్ రుద్రమ-2 ఎంపిక
- విద్యార్థుల ప్రతిభకు ఇనగాల 2 లక్షల ఆర్థిక సాయం

**హనుమకొండ, మహా ;** హనుమకొండ నగరంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ - 2026, ఎడిషన్ 02' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తన నివాసానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గతంలో కుడా చైర్మన్ గా ఉన్న హయాంలో ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాకెట్ రుద్రమ 1 లాంచ్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. అదే స్ఫూర్తితో ఇప్పుడు మళ్ళీ వరంగల్ ఎన్ ఐటీ విద్యార్థి పింగిళి రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని బృందం రూపొందించిన 'రాకెట్ రుద్రమ2' మరో అరుదైన ఘనత సాధించింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ఇన్ స్పేస్ సంయుక్తంగా ఉత్తర్ ప్రదేశ్ లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇన్ స్పేస్ మోడల్ రాకెట్రీ ఇండియా స్టూడెంట్ కాంపిటీషన్" పోటీలలో 'రాకెట్ రుద్రమ 2' అత్యంత కీలకమైన క్రిటికల్ డిజైన్ రివ్యూ క్వాలిఫికేషన్ సాధించి, జాతీయ స్థాయి ఫైనల్స్ కు అర్హత సాధించింది. ఈ రాకెట్ తుది తయారీ, ప్రయోగ ఖర్చుల కొరకు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. డల్లాస్ కంపనీ ఈ4 జడ్ టెక్నాలజీస్ అధినేత శరత్ రెడ్డి సౌజన్యంతో రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు దానికి సంబంధించిన చెక్కును రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా ఎన్ ఐటీ వరంగల్ విద్యార్థి పింగిళి రాజశేఖర్ రెడ్డి వారి బృందానికి అందజేశారు. సాంకేతిక రంగాన్ని ప్రోత్సహిస్తూ, దేశ భవిష్యత్తు అయిన ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తున్న ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ని అంతరిక్ష రంగంలో రాణిస్తున్న ఎన్ ఐటీ విద్యార్థుల బృందాన్ని మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే జాతీయ స్థాయి పోటీల్లో 'రాకెట్ రుద్రమ 2' విజయం సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.



# ప్రజలకు వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు

- చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం
- డిఎంహెచ్వో అప్పయ్య

**హనుమకొండ, మహా :** హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య శనివారం జిల్లాలోని కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బోడగుట్ట, వడ్డేపల్లి, సోమిడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలను, సిబ్బంది హాజరు ను పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వైద్యాధికారి సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఒకరు, బోడగుట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం లో 9 మంది, సోమిడి పట్టణ ఆరోగ్య కేంద్రం లో 12 మంది, వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం లో 14 మంది ఉద్యోగులు విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. అందుబాటులో ఉన్న రెగ్యులర్ ఏఎన్‌ఎంలు, మహిళా సూపర్‌వైజర్ సిబ్బంది సహకారంతో టీకాల కార్యక్రమాన్ని, ఔట్‌రీచ్ వ్యాక్సినేషన్ సెషన్లను నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

**పండుగకు ప్రత్యేక వైద్య కేంద్రాలు**
సద్దుల బతుకమ్మ పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని అన్ని వైద్యాధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని డాక్టర్ అప్పయ్య ఆదేశించారు. పండుగ జరిగే ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అత్యవసర వైద్య సేవల కోసం పురుష సిబ్బందిని విధుల్లో నియమించాలని సూచించారు. బతుకమ్మ పండుగలో పాల్గొనే మహిళా ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా, పండుగలో పాల్గొనని మహిళా ఉద్యోగుల సేవలను అవసరానికి అనుగుణంగా వినియోగించుకొని వైద్య సేవలు కొనసాగించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ప్రజలకు అత్యవసర వైద్య సహాయం అందుబాటులో ఉండేలా సిబ్బంది విధులను ముందుగానే కేటాయించాలని, అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సామగ్రి సిద్ధంగా ఉంచాలని సూచించారు. సమ్మె పరిస్థితులు, పండుగ ఏర్పాట్ల నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అన్ని వైద్య సంస్థల్లో వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా తగిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ అప్పయ్య స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత, సూపర్ వైజర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# విచారణ జరిపించి న్యాయం చేయండి

- ఎస్సీ, ఎస్టీ కేసులో తప్పిదాల పై జర్నలిస్టుల ఫిర్యాదు
- సమగ్ర విచారణ జరిపించాలని వరంగల్ సీపీ కి ఫిర్యాదు

**హనుమకొండ, మహా ;** ఎస్సీ,ఎస్టీ కేసు (ఎఫ్ఐఆర్ నంబర్ 471/2025) విచారణలో జరిగిన తప్పిదాల పై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతకు జర్నలిస్టులు శనివారం ఫిర్యాదు చేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్ నంబర్ 471/2025 కింద నమోదైన కేసులో తాము సాక్షులుగా ఉన్నామని జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, తోట సుధాకర్, పెండెం వేణుమాధవ్, మేరుగుల రాజేంద్రప్రసాద్ తెలిపారు. విచారణ అధికారిగా ఉన్న హనుమకొండ ఏసీపీ నరసింహారావు తో పాటు ఏ ఒక్క పోలీసు అధికారి కూడా తమను విచారణకు పిలవలేదని వారు పేర్కొన్నారు. తమ నుంచి ఎలాంటి వాంగ్మూలాలు తీసుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినప్పటికీ, 2025 ఆగస్టు 15న ఏసీపీ సమక్షంలో తాము వాంగ్మూలాలు ఇచ్చినట్లు పత్రాలు సృష్టించి వాటిని న్యాయస్థానానికి సమర్పించి కేసును మూసివేసినట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఇదే విషయం పై విచారణాధికారిగా ఉన్న సంబంధిత ఏసీపీని సంప్రదించడంతో కేసు మూసివేశామని తెలపడంతో ఖంగు తిన్నామని తెలిపారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండానే కేసును ఎలా మూసివేస్తారని ప్రశ్నించడంతో ఏమైనా ఉంటే కోర్టుకు వెళ్లి చూసుకోవాలని సమాధానమిచ్చారని పేర్కొన్నారు. తమను విచారించకుండానే తమ పేర్లతో వాంగ్మూలాలు ఎలా నమోదు చేశారు? వాటిని ఏ ఆధారాలతో న్యాయస్థానానికి సమర్పించారు? అనే అంశాల పై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. సంబంధిత పోలీసు రికార్డులు, వాంగ్మూలాలు, న్యాయస్థానానికి సమర్పించిన పత్రాలను పునః పరిశీలించి, విచారణలో బాధ్యులుగా తేలిన అధికారుల పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. కోర్టు ద్వారా తీసుకున్న పత్రాలన్నింటినీ సిపికి అందించారు. ఫిర్యాదును, పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ శ్వేత ఐపీఎస్ సానుకూలంగా స్పందించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి విచారణ జరిపిస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించిన కేసులో బాధితుడు కంకనాల సంతోష్ మరో ఫిర్యాదులో తనకు జరిగిన అన్యాయం పై సీపీకి వివరించారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. సీపీ ని కలిసిన వారిలో జర్నలిస్ట్ వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకటరమణ, టీయూడబ్ల్యూజె హన్మకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి పొడిచెట్టి విష్ణువర్ధన్ , గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, టియుడబ్ల్యూజే రాష్ట్ర బాధ్యులు పి .వేణుమాధవ్, తోట సుధాకర్, బొల్ల అమర్, మేరుగుల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# యువత ఆరోగ్యం పై దృష్టి సారించాలి

- క్రీడలతోనే మానసిక ఉల్లాసం శారీరక దృఢత్వం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026 రెండో ఎడిషన్ ను ప్రారంభించిన మంత్రి

**హనుమకొండ, మహా ;** యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం తో పాటు ఆరోగ్యం పై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ కార్యక్రమం అభినందనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నాయిని విశాల్ ట్రస్ట్, క్రెడాయ్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్-2026 రెండో ఎడిషన్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై 5కే పరుగును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, శారీరక వ్యాయామం, క్రీడలు, ధ్యానం ద్వారా ఒత్తిడి, ఆందోళన, ఇతర అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మారథాన్ లో సుమారు నాలుగు నుంచి ఐదు వేల మంది పాల్గొనేందుకు నమోదు చేసుకోవడం సంతోషకరమన్నారు. వరంగల్, హనుమకొండ నగరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. యువతలో పెరుగుతున్న ఒత్తిడి, ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.




క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ శ్రీ గోదా రెడ్డిలను అభినందించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం, ప్రజల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఈ మారథాన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కార్యక్రమానికి మరింత స్పందన లభించడం సంతోషకరమన్నారు. మారథాన్ విజయానికి సహకరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, క్రెడాయ్ ప్రతినిధులు, స్పాన్సర్లు, నిర్వాహకులు, క్రీడాకారులు, యువతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, మారథాన్ నిర్వాహకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రన్నర్లు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్ నగరాభివృద్ధికి, ఐటీ టవర్ల ఏర్పాటుకు కృషి చేస్తాం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ఆలయాల్లో మంత్రి ప్రత్యేక పూజలు
- భద్రకాళి అమ్మవారి రథాన్ని ప్రారంభించిన మంత్రి,ఎమ్మెల్యే

**హనుమకొండ, మహా ;** వరంగల్, హనుమకొండ నగరాలకు ఐటీ టవర్ల ఏర్పాటు కోసం అవసరమైన ప్రతిపాదనలను పరిశీలించి, రానున్న రోజుల్లో ముందుకు తీసుకెళ్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన వరంగల్ నగరంలో పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భద్రకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమకొండ లో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ (ఎడిషన్2)ను ప్రారంభించిన అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి నగరంలోని ప్రముఖ ఆలయాలను సందర్శించారు. తొలుత శ్రీ పద్మాక్షి అమ్మవారిని దర్శించుకుని



హోమ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమా రాజేందర్ రెడ్డి, తో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు. వరంగల్ నగరానికి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పే శ్రీ భద్రకాళి అమ్మవారి రథ నిర్మాణ పనులు పూర్తికావడంతో, ఆలయ అధికారులు, అర్చకుల ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. మాడవీధుల్లో ఊరేగింపున కు సిద్ధమైన అమ్మవారి రథం ప్రారంభం కావడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం ప్రముఖ శైవక్షేత్రమైన వేయిస్తంభాల దేవాలయంలో శ్రీ రుద్రేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి వద్ద కూడా పూజల్లో పాల్గొన్నారు. వరంగల్ నగరం చారిత్రక కట్టడాలు, ప్రాచీన ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయమని మంత్రి తెలిపారు. ఈ ప్రాంత వారసత్వ సంపదను కాపాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు వరంగల్, హనుమకొండ నగరాల్లో ఐటీ టవర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల అధికారులు, ప్రధాన అర్చకులు, పురోహితులు మంత్రికి, ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందించారు.

# ప్రమాదకర శబ్ద పరికరాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు**

మట్వాడ, మహా ; సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రమాదకరమైన శబ్దాలు చేసే పీకలు, ఇతర శబ్ద పరికరాలను విక్రయించరాదని మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి పరికరాలను విక్రయించే వ్యాపారుల పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నపిల్లలు, యువత ఇలాంటి ప్రమాదకర శబ్ద పరికరాలను ఉపయోగించకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శబ్ద కాలుష్యాన్ని నివారిస్తూ, ఇతరులకు ఇబ్బంది కలగకుండా, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పండుగలను ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలని మట్వాడ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## అగ్గిమీద గుగ్గిలమైన రాజకీయాలు...

# ఆందోళనకర ప్రకృతి వైపరీత్యాలు



ప్రకృతి పగబట్టిన వేళ... రాజకీయ వేదికలు రణరంగాలైన వేళ... దేశ భవిష్యత్తును మలుపుతిప్పే సంచలన పరిణామాలు తెరవెనుక వేగంగా మారుతున్నాయి. అక్టోబర్ మాసంలోనే హైదరాబాద్ నగరాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అసాధారణ ఎండలు, తెలుగు రాష్ట్రాలను భయపెడుతున్న 'ఎల్ నినో' నీడలు, నీటికష్టాల ముప్పుపై అసలు నిజమేంటి? మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల హడావుడి రక్తసిక్త నామినేషన్ కేంద్రాలుగా మారి, పాత కక్షల 'ఫ్యాక్షన్' మళ్ళీ పడగవిప్పుతోందనే ఆందోళనలను రేకెత్తిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలి వెనుక అసలు కుట్ర కోణాలున్నాయా? ఓట్ చోరీ ఆందోళనల ఆరోపణలు దేశ రాజకీయాల్లో ఎలాంటి భూకంపం సృష్టించబోతున్నాయి? రానున్న రోజుల్లో దేశాన్ని కుదిపేయబోయే సంచలన మార్పుల మర్మమేమిటి?

**తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ -మహాపత్రిక సీఈవో**

**కంది రామచంద్రారెడ్డి**

**వీకెండ్ అనాలసిస్**

వానలు రావలసిన వేళ వలసపోయాయి. చలికి గజగజవణకాల్సిన శీతాకాలం ప్రారంభంలోనే భానుడు ప్రతాపం చూపుతున్నాడు.

సాధారణంగా అక్టోబర్ అనగానే తెలుగు రాష్ట్రాల్లో శరదృతువు చల్లటి గాలులు, వర్షాకాలపు చివరి కనుచూపులు గుర్తుకు వస్తాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి పూర్తిగా భిన్నం. దేశ ఆర్థిక రాజధాని ముంబై నుండి సాంస్కృతిక హైదరాబాద్ వరకు అక్టోబర్ మాసంలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఉష్ణోగ్రతల అసమతుల్యత కారణంగా 'ఎల్ నినో' ప్రభావం భారతీయ రుతుపవనాలపై తీవ్రమైన దెబ్బతీస్తోంది. ఇది కేవలం వ్యవసాయ రంగాన్ని మాత్రమే కాకుండా, తెలుగు రాష్ట్రాల తాగునీటి భద్రతను కూడా ప్రశ్నార్థకం చేస్తోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన జలాశయాల్లో నీటిమట్టాలు అంచనా కంటే వేగంగా పడిపోతున్నాయి. వచ్చే వేసవి నాటికి హైదరాబాద్ నగరంతో పాటు రాయలసీమ, తెలంగాణలోని పలు జిల్లాలకు తీవ్రమైన తాగు, సాగునీటి కష్టాలు తప్పవనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాలు ఇప్పటికైతే ప్రత్యామ్నాయ జలవనరుల ప్రణాళికలను వేగవంతం చేయకపోతే పరిస్థితి చేయి దాటే ప్రమాదం ఉంది. నీటిభద్రత, పొదుపు విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా అప్రమత్తంగా ఉండకపోతే ఇబ్బందులు పడేది మనమే.

**ఏపీలో ఎన్నికల యుద్ధం**

ఏపీలో స్థానిక ఎన్నికల రణరంగం. గ్రామ సీమలలో గెలుపు యుద్ధం. బ్యాలెట్ బాక్సుల చుట్టూ భయాల నీడలు కమ్ముకున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సమరం కేవలం పంచాయతీ ఎన్నికల ప్రక్రియలా కాకుండా, పార్టీల మధ్య ప్రాణాలను పణంగా పెట్టే రణరంగంగా మారుతోంది. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు రక్తమోడుతుండటం, ప్రత్యర్థులపై దాడులు, బెదిరింపుల పర్వాలు పాత కక్షల 'ఫ్యాక్షన్ రాజకీయం' మళ్లీ రాష్ట్రంలో తలలెత్తుతోందనే భయాలను రేకెత్తిస్తున్నాయి. స్థానిక సంస్థల పీఠాన్ని దక్కించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో పట్టు నిలుపుకోవాలనే కసితో పార్టీలు శ్రేణులను బరిలోకి దించుతున్నాయి. అయితే, ఈ క్రమంలో శాంతిభద్రతల పరిరక్షణ పూర్తిగా గాడితప్పుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరగాల్సిన చోట కత్తులు, బాంబులు, దాడులు సంస్కృతిగా మారడం ప్రజాస్వామ్య వ్యవస్థే సిగ్గుపడేలా చేస్తోంది. అణచివేత ధోరణులు పెరిగితే, సామాన్య ఓటర్లు బూత్‌ల ముందుకు వచ్చే ధైర్యం చేయలేరు. ఇది అంతిమంగా ప్రజాస్వామ్య స్ఫూర్తినే దెబ్బతీస్తుంది.

**కేంద్ర ఎన్నికల కమిషన్ తీరుపై అపనమ్మకం**

చట్టం కళ్లకు గంతలు కట్టినట్లు కాదు. ప్రజాస్వామ్య రక్షకులే నిద్రపోతున్నారనే అనుమానాలు బలపడుతున్నాయి. దేశ రాజకీయాల్లో కేంద్ర ఎన్నికల సంఘం తటస్థతపై గత కొంతకాలంగా తీవ్రమైన చర్చ జరుగుతోంది. ముఖ్యంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిని తప్పుపడుతూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం సీఈసీని తన రాజకీయ ప్రయోజనాల కోసం కాపాడుతోందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల సవరణ, ఓట్ల తొలగింపు, 'ఓట్ చోరీ' ఆరోపణలు ప్రజాస్వామ్య మూలాలనే కదిలిస్తున్నాయి. ఒక వ్యూహాత్మక ప్రణాళిక ప్రకారం నిర్దిష్ట ప్రాంతాల్లో ఓట్లను తొలగిస్తున్నారనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీనివెనుక పెద్ద స్థాయి రాజకీయ కుట్రలున్నాయా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఎన్నికల సంఘం ఈ ఆరోపణలపై పారదర్శకంగా వ్యవహరించి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

పెనుగులాటల పొత్తిళ్లలోనే కొత్త చరిత్ర పుడుతుంది. దేశం మరోసారి ఒక పెద్ద రాజకీయ మలుపునకు సిద్ధమవుతోందన్న సంకేతాలు కనబడుతున్నాయి. ఈఏడాది నవంబర్ తర్వాత నుండి వచ్చే ఏడాది వేసవిలోగా అనేక మార్పులకు బీజం పడవచ్చు. ఒకవైపు పర్యావరణ ముప్పు తెలుగు రాష్ట్రాలను అల్లాడిస్తుంటే, కేంద్ర స్థాయిలో ఎన్నికల వ్యవస్థపై పెరుగుతున్న నమ్మకరాహిత్యం... దేశం ఒక చారిత్రక సంధిగ్ధ దశలో ఉందనేదానికి సంకేతాలు. ప్రపంచ స్థాయి పరిణామాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ పరిణామాలు దేశ రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయడం ఖాయం. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి ప్రజలు, మేధావులు, రాజకీయ నాయకులు స్పందించాల్సిన, పరిశీలన చేయాల్సిన సమయం ఆసన్నమైంది.



---

# పొట్టలో కొవ్వు ఎక్కువగా ఉందా?

## ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పుతో సంబంధం ఉందంటున్న అధ్యయనం!

**హైదరాబాద్:** పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడాన్ని చాలామంది కేవలం శరీర ఆకృతికి సంబంధించిన సమస్యగా భావిస్తారు. కానీ ఇది ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపవచ్చని తాజా పరిశోధన సూచిస్తోంది. ముఖ్యంగా పొట్టలో అధికంగా పేరుకుపోయే కొవ్వుకు ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదంతో సంబంధం ఉండవచ్చని *జర్నల్ ఆఫ్ థొరాసిక్ ఆంకాలజీ *లో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది. పరిశోధకులు 1,170 మంది ఆరోగ్య సమాచారాన్ని, సీటీ స్కాన్ వివరాలను విశ్లేషించారు. వీరిలో ప్రారంభ దశ ఊపిరితిత్తుల క్యాన్సర్ ఉన్న 594 మంది, క్యాన్సర్ లేని 576 మంది ఉన్నారు. క్యాన్సర్ ఉన్నవారిలో పొట్ట ప్రాంతంలోని మొత్తం కొవ్వు పరిమాణం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అయితే, ఈ ఫలితాలు పొట్ట కొవ్వే క్యాన్సర్‌కు ప్రత్యక్ష కారణమని నిరూపించలేదు.

సాధారణంగా అధిక బరువును అంచనా వేయడానికి బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ)ను ఉపయోగిస్తారు. అయితే, ఒక వ్యక్తి శరీరంలో కొవ్వు ఎంత ఉంది, అది ఏ ప్రాంతంలో పేరుకుపోయిందనే విషయాలను బీఎంఐ పూర్తిగా తెలియజేయలేదని పరిశోధకులు చెబుతున్నారు. అందుకే సీటీ స్కాన్ ద్వారా పొట్టలోని కొవ్వు పరిమాణాన్ని పరిశీలించారు. వయసు, లింగం, ధూమపానం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా పొట్ట కొవ్వుకు, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు మధ్య సంబంధం కనిపించింది.

ఈ సంబంధానికి గల కారణాలను తెలుసుకునేందుకు పరిశోధకులు రోగనిరోధక వ్యవస్థ పనితీరును కూడా పరిశీలించారు. అధిక కొవ్వు వల్ల ఊపిరితిత్తుల్లోని రోగనిరోధక ప్రతిస్పందన బలహీనపడే అవకాశం ఉందని ప్రయోగశాల అధ్యయనాలు సూచించాయి. ముఖ్యంగా క్యాన్సర్ కణాలను ఎదుర్కోవాల్సిన కొన్ని రోగనిరోధక కణాల పనితీరులో మార్పులు కనిపించాయి. అయితే, ఈ ప్రక్రియ మానవుల్లో క్యాన్సర్‌కు ఎలా దోహదపడుతుందనే అంశంపై మరింత పరిశోధన అవసరం.

పొట్టలో కొవ్వు తగ్గించుకోవడానికి సమతుల్య ఆహారం తీసుకోవడం, కూరగాయలు, పండ్లు, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం ఉపయోగపడతాయి. ధూమపానానికి దూరంగా ఉండటం కూడా ఊపిరితిత్తుల ఆరోగ్యానికి అత్యంత ముఖ్యం. పొట్ట కొవ్వు ఉన్నంత మాత్రాన క్యాన్సర్ వస్తుందని భావించకూడదు. అదే సమయంలో, ధూమపానం చేసే అలవాటు ఉన్నవారు లేదా ఇతర ప్రమాద కారకాలు ఉన్నవారు వైద్యుల సూచనల మేరకు తగిన పరీక్షలు చేయించుకోవాలి. ఈ అధ్యయనం పొట్ట కొవ్వు, ఊపిరితిత్తుల క్యాన్సర్ మధ్య సంబంధాన్ని సూచిస్తోంది కానీ దీనిపై మరిన్ని అధ్యయనాలు అవసరం.









## యువ దర్శకుల సృజనాత్మకత

# సమాజంలో చైతన్యం నింపాలి

- **వినోదంతో పాటు సామాజిక సందేశాలిచ్చే లఘు చిత్రాలను రూపొందించాలి**
- **హైదరాబాద్‌ను భారతీయ చిత్ర పరిశ్రమకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**
- **డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపు**

**హైదరాబాద్, మహా :** యువ దర్శకుల సృజనాత్మకత సమాజంలో చైతన్యం నింపాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ శిల్పకళావేదికలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డ్స్-2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమని, విభిన్న రంగుల పూలు ఒకచోట చేరినట్లుగా సమాజంలోని అన్ని వర్గాలను కలిపే సంస్కృతికి ఈ పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. మూడు గంటల సినిమాలో చెప్పే కథను కేవలం రెండు, మూడు నిమిషాల లఘు చిత్రంలో ప్రభావవంతంగా చెప్పడం గొప్ప సృజనాత్మకత అని అభినందించారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భవిష్యత్తులో నీటి కొరత, పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ పొదుపు వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించే చిత్రాలను రూపొందించాలని యువ దర్శకులకు సూచించారు. తెలంగాణ యువతలో అపారమైన సృజనాత్మక ప్రతిభ ఉందని, ఆ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌ను కేవలం తెలుగు చిత్ర పరిశ్రమకే పరిమితం చేయకుండా భారతీయ సినిమా రంగానికి ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. పోటీల్లో అవార్డులు అందుకోని యువ దర్శకులు నిరుత్సాహపడకుండా మరింత సృజనాత్మకతతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎఫ్ డీసీ ఛైర్మన్ దిల్ రాజు, కొండా రాజ్, ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్, ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్, కమిషనర్ ముకుందరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.















# కేఫ్ మజాలో ధరల దోపిడీ ఆరోపణలు!

- కప్పు కాఫీకి రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారంటూ వినియోగదారుల ఆవేదన
- ఆహార పదార్థాల ధరలపై నియంత్రణ ఏదీ?
- ఆహార నాణ్యతపై తనిఖీలు కరువు.. పట్టించుకోని అధికారులు!

**ఖమ్మం, అక్టోబర్ 17: మహా :** పట్టణ ప్రాంతాల్లో కనిపించే ధరల మోత పల్లెటూళ్లకూ పాకుతోంది. రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలోని *కేఫ్ మజాలో* ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ వినియోగదారుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రజలు, మధ్యతరగతి కుటుంబాలు హోటళ్లలో అల్పాహారం, భోజనం చేయాలన్నా జేబుకు చిల్లు పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కప్పు కాఫీకి రూ.50నా?**

కేఫ్ మజాలో కప్పు కాఫీకి రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినియోగదారుల్లో చర్చనీయాంశంగా మారాయి. సాధారణ హోటళ్లలో అందుబాటులో ఉండే ధరలతో పోలిస్తే ఇక్కడి ధరలు అధికంగా ఉన్నాయని పలువురు అంటున్నారు. పల్లెటూరి పరిసరాల్లోనూ మెట్రో నగరాల స్థాయి ధరలు వసూలు చేస్తే సామాన్యులు ఎలా భరించాలని ప్రశ్నిస్తున్నారు. ఆహార పదార్థాల ధరలకు సంబంధించి స్పష్టమైన ధరల పట్టికను ప్రదర్శిస్తున్నారా? వసూలు చేస్తున్న మొత్తానికి తగిన నాణ్యత, పరిమాణం అందిస్తున్నారా? అన్న అంశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**నాణ్యతపై పర్యవేక్షణ ఏదీ?**

అధిక ధరలకు తోడు ఆహార పదార్థాల నాణ్యతపైనా వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటిస్తున్నారా? ముడి సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్నారా? వంటశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నారా? అన్న అంశాలపై తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. ఆహార భద్రతా ప్రమాణాలు పాటించకపోతే ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.

**అధికారులు స్పందించేనా?**

హోటళ్లు, కేఫ్‌లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, ధరల ప్రదర్శన వంటి అంశాలను సంబంధిత అధికారులు పరిశీలించాల్సి ఉంది. వెంకటాయపాలెంలోని కేఫ్ మజాపై వస్తున్న ఆరోపణలను పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో
# కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం

- నవంబరు 6లోగా పట్టభద్రుల ఓటరు నమోదును పూర్తి చేయాలి
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పిలుపు



**సత్తుపల్లి, అక్టోబరు 17:మహా :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

**ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి**

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు నవంబరు 6తో ముగియనున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరినీ గుర్తించి, ఫారం-18 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించాలని ఎమ్మెల్యే సూచించారు. పట్టణాలు, గ్రామాలు, వార్డులవారీగా ప్రత్యేక దృష్టి సారించి అర్హులెవరూ ఓటు హక్కు పొందకుండా మిగిలిపోకుండా చూడాలని కోరారు. గతంలో ఓటరుగా నమోదైన పట్టభద్రులు సైతం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించాలని రాగమయి సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణతో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# పెద్దపల్లిలో దసరా రోజున రావణ దహనం

**రామ్‌లీలా ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**

పెద్దపల్లి మహా : దసరా ఉత్సవాలను పురస్కరించుకొని పెద్దపల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న రామ్‌లీలా (రావణ దహనం) కార్యక్రమ ఏర్పాట్లను ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించిన ఆయన, దసరా రోజున నిర్వహించే రావణ దహన కార్యక్రమానికి ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బసంత్‌నగర్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి
# కేంద్రానికి బీఆర్ఎస్ నేత వినతి

- ఉడాన్ పథకం కింద విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి.

**పాలకుర్తి, మహా 17 అక్టోబర్ :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గ పరిధిలోని పాలకుర్తి మండలం బసంత్‌నగర్ ఎయిర్‌పోర్ట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉడాన్ పథకం కింద అభివృద్ధి చేసి, విమాన సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకుడు ఈదునూరి శ్యామ్ కుమార్ కేంద్ర పౌర విమానయాన శాఖకు వినతి సమర్పించారు.బసంత్‌నగర్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తే పెద్దపల్లి జిల్లాతో పాటు రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని, పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు.ఈ అంశంపై కేంద్ర పౌర విమానయాన శాఖకు అధికారిక ఫిర్యాదు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ ఫిర్యాదు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా AAI జనరల్ మేనేజర్ సంజయ్ దులారే పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం ఈ వినతిపై సానుకూలంగా స్పందించి, బసంత్‌నగర్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని శ్యామ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.



CITIZEN REPRESENTATION UNDER RCS-UDAN

PUBLIC GRIEVANCE AND FORMAL COMPLAINT

Location: Basanthnagar, Peddapalli District, Telangana — Date: 16 October 2026

SUBJECT: Request for a Time-Bound Decision and Development of Basanthnagar Airport, Peddapalli District, Telangana, under the UDAN Regional Connectivity Scheme

TO:
1. The Hon'ble Minister of Civil Aviation, Government of India
2. The Secretary, Ministry of Civil Aviation, Government of India
3. The Chairman, Airports Authority of India
4. The Chief Secretary, Government of Telangana

Respected Sir/Madam,

I, Shyam Kumar Naliganti, Palakurthy Mandal Leader and a resident of Esala Takkallapalli village, Palakurthy Mandal, Peddapalli District, Telangana, respectfully submit this public grievance on behalf of concerned citizens of Palakurthy Mandal, the Ramagundam region, and Peddapalli District.

This representation seeks urgent attention to the proposed development and operationalisation of the existing airstrip at Basanthnagar as a domestic passenger airport, with cargo-handling facilities wherever technically and commercially feasible, under the applicable aviation policies and the UDAN Regional Connectivity Scheme.

1. BACKGROUND AND REGIONAL IMPORTANCE

Basanthnagar is situated in an important industrial region of Northern Telangana. The surrounding area includes major industrial establishments and economic activities associated with NTPC Ramagundam, Ramagundam Fertilizers and Chemicals Limited (RFCL), Singareni Collieries Company Limited (SCCL), cement industries, and the granite sector.

Improved air connectivity could facilitate industrial travel, business development, investment, emergency transportation, and access to regional markets. The existing airstrip provides a basis for examining the technical and economic feasibility of developing an aviation facility at this location.

2. NEED FOR BETTER AIR CONNECTIVITY

Residents of Peddapalli and neighbouring districts, including Karimnagar, Mancherial, Jagtial, and Kumuram Bheem Asifabad, could potentially benefit from improved regional air connectivity.

At present, many residents who require air travel must consider travelling to Hyderabad or other operational airports. This can involve additional road travel, time, and expense, particularly for business travellers, families, and people facing urgent travel requirements.

A detailed study should therefore assess passenger demand, catchment population, road and rail connectivity, and the feasibility of scheduled air services from Basanthnagar.

Public Grievance: Basanthnagar Airport Development (Peddapalli District, Telangana) — Page 1 of 3



# కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు

**సత్తుపల్లి, అక్టోబర్ 17:మహా :** సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఐఎన్‌టీయూసీ సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు జేవీఆర్ ఓపెన్‌కాస్ట్‌లోని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన సహపంక్తి భోజన కార్యక్రమంలో నాయకులు, కార్మికులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ పొట్టి కిరణ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు జగదీష్ మరాటి, శ్రీధర్, ఆలయ కమిటీ సభ్యుడు రాము, గని కమిటీ సభ్యులు రమేష్, సందీప్, రాంచందర్, తిరుమలరావు, రవి, ఇక్బాల్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.



# ఆసుపత్రులకు అవార్డులు

- వైద్య సిబ్బందిని అభినందించిన కలెక్టర్
- మారుమూల ప్రాంతాల్లోనూ నాణ్యమైన వైద్య సేవలకు గుర్తింపు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాయకల్ప్ కార్యక్రమంలో పాల్గొన్న ఐదు తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) ఆసుపత్రులూ అవార్డులు సాధించి వంద శాతం విజయాన్ని నమోదు చేయడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం ఐడిఓసి కార్యాలయం కలెక్టర్ ఛాంబర్ నందు కాయకల్ప్ అవార్డులు సాధించిన ఆసుపత్రుల బృందాలను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఎదురయ్యే అనేక సవాళ్లను అధిగమిస్తూ అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఆసుపత్రుల్లో పరిశుభ్రత పారిశుద్ధ్యం నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పేద గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైద్యులు నర్సింగ్ పారామెడికల్ పారిశుద్ధ్య సిబ్బంది సమష్టి కృషి అంకితభావం ఈ విజయానికి కారణమని తెలిపారు. జిల్లాలోని భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట, ఇల్లందు, పాల్వంచ ఆసుపత్రులు కాయకల్ప్ అవార్డులు, ప్రశంసా పురస్కారాలు సాధించడం వైద్య సేవల నాణ్యతను పెంపొందించడంలో సిబ్బంది చేస్తున్న కృషికి నిదర్శనమని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రాష్ట్రస్థాయి పర్యావరణహిత అవార్డు లభించడం జిల్లాకు గర్వకారణమన్నారు.మణుగూరు, అశ్వారావుపేట వంటి మారుమూల ప్రాంతాల్లోని ఆసుపత్రులు తొలి ప్రయత్నంలోనే అవార్డులు సాధించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. అందుబాటులో ఉన్న పరిమిత వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ నిబద్ధతతో పనిచేస్తే నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు మరిన్ని గుర్తింపులు సాధించవచ్చని ఈ విజయం నిరూపిస్తోందన్నారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రత పారిశుద్ధ్యం వైద్య వ్యర్థాల నిర్వహణ ఇన్‌ఫెక్షన్ల నియంత్రణ పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో నిర్దేశిత ప్రమాణాలను నిరంతరం పాటించాలని కలెక్టర్ సూచించారు. కాయకల్ప్ అవార్డుల ద్వారా లభించిన గుర్తింపును స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులోనూ సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని పేద గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ మరిన్ని అవార్డులు సాధించాలని ఆసుపత్రుల బృందాలకు సూచించారు .ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, సంబంధిత ఆసుపత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ రాధారుక్మిణి, డాక్టర్ గౌరీ ప్రసాద్, డాక్టర్ రామ్‌ప్రసాద్, డాక్టర్ సోమరాజ్ దారా, డాక్టర్ మౌనిక తదితరులతో పాటు నర్సింగ్, పారామెడికల్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అవార్డుల సాధనకు కృషి చేసిన ప్రతి ఒక్కరినీ జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.



# సీతారామతో సాగునీటి భరోసా

- మంత్రి తుమ్మల కృషిపై ఎంపీ, ఎమ్మెల్యే ప్రశంసలు
- యాతాలకుంటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**సత్తుపల్లి, అక్టోబరు 17**:మహా సీతారామ ఎత్తిపోతల పథకం మెట్ట ప్రాంత రైతులకు సాగునీటి భరోసా కల్పించనుందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పేర్కొన్నారు. శనివారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామం వద్ద ప్రాజెక్టు సొరంగాన్ని వారు పరిశీలించారు. గోదావరి జలాలను సాగునీటి అవసరాలకు వినియోగించడంలో సొరంగాలు, అనుసంధాన కాలువలు కీలకమని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం యాతాలకుంట గ్రామస్థులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# సత్తా చాటిన విద్యార్థులు

- బీటెక్‌లో 48 శాతం
- బీఎస్సీలో 52 శాతం ఉత్తీర్ణత

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పరిధిలో ఉన్న డాక్టర్ మన్మోహన్ సింగ్ భూ విజ్ఞానశాస్త్ర విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాల వివరాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి రిజిస్ట్రార్ అనుమతితో ఓఎస్డీ టు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.జగన్మోహన్ రాజు, పరీక్షల ఇన్‌చార్జి నియంత్రణాధికారి డాక్టర్ ఈ.హరికృష్ణ, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ కే.కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ప్రకటించారు. ఈ పరీక్షల్లో బీటెక్ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మైనింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) విభాగాల్లో 48 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బీఎస్సీ (జియాలజీ, పర్యావరణ శాస్త్రాలు) విభాగాల్లో 52 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫలితాల విడుదల కార్యక్రమంలో సహాయ ఆచార్యురాలు ఎస్‌కే అనీఫా, ఈఈఈ విభాగం సహాయ ఆచార్యుడు డాక్టర్ కే.శ్రీనివాస్, పరీక్షల విభాగం సీనియర్ సహాయకురాలు జి.మల్లేశ్వరి, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం సీనియర్ సహాయకుడు ఎం.నరసింహమూర్తి, ప్రయోగశాల సహాయకుడు రాజారావు, ప్రయోగశాల సహాయకుడు, అకౌంట్స్ విభాగం అధికారి డి.శ్రీనివాస్, అకడమిక్స్ విభాగం సీనియర్ సహాయకుడు ఎస్.శ్రీనివాస్, పరీక్షల విభాగం జూనియర్ సహాయకుడు హరి ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

- పారదర్శకంగా, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలి
- డీసీపీ బి. రాం రెడ్డి



**పెద్దపల్లి మహా** : ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలని పెద్దపల్లి జోన్ డీసీపీ భుక్య రాం రెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డీసీపీ ఆధ్వర్యంలో శనివారం బసంత్‌నగర్‌లోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం సమావేశ మందిరంలో పెద్దపల్లి జోన్ పోలీసు సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో నేర పరిశోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నూతన నేర చట్టాలు, నేరాలు-నేరస్తుల గుర్తింపు వ్యవస్థ, సమగ్ర నేర న్యాయ వ్యవస్థ, పోలీసు విభాగాల వారీగా విధులు, ఫిర్యాదుల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఈఎఫ్ఐఆర్ , ఈసమన్లు , ఈఛార్జ్‌షీట్ దాఖలు చేసే విధానాలపై శిక్షణ ఇచ్చారు. పోలీసు సిబ్బంది ఫిర్యాదుదారులతో గౌరవప్రదంగా వ్యవహరించాలని, ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సమర్థవంతంగా పరిష్కరించాలని డీసీపీ సూచించారు. విధుల్లో అందుబాటులో ఉన్న సాంకేతిక వ్యవస్థలను సక్రమంగా వినియోగిస్తూ పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు, నూతన చట్టాలు, సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహనతో సిబ్బంది విధులు నిర్వహించేలా తీర్చిదిద్దడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని డీసీపీ బి. రాం రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, వివిధ సర్కిళ్ల పోలీసు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, స్టేషన్ రైటర్లు, రిసెప్షన్ కానిస్టేబుళ్లు, కోర్టు కానిస్టేబుళ్లు, సీసీటీఎన్ఎస్ రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణా సంస్కృతి ,సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

**జడ్జి .బి.భవానీ**

**దమ్మపేట ,మహా :** తెలంగాణ ఆడపడుచులకు , రాష్ట్ర ప్రజలకు సంస్కృతి ,సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి బి. భవానీ పేర్కొన్నారు. శనివారం కోర్టు ఆవరణ పరిదిలో మహిళా లాయర్ల చేత ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ఉద్యోగ నిర్వహణలో ఉంటూ తెలంగాణ సంప్రదాయాలను నేడు కొందరు యాది విడుస్తున్నరని అన్నారు. ఎప్పుడు ,ఎవరు ఏ స్థాయిలో ఉన్నా పల్లె పండుగలను జరుపుకోవాలని కోరారు. ఉల్లాసంగా ,ఉత్సాహంగా కోలాట మేళతాళాలతో జడ్జి స్టెప్పులు కలుపుతూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో న్యాలయవాదులు ,మహిళలు పాల్గొన్నారు.



# ఆయుష్ శాఖలో ఉద్యోగాల భర్తీ

- ఔత్సాహికుల నుండి దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 26వ తేదీలోగా అప్లై చేసుకోవాలన్న కలెక్టర్



**ఆదిలాబాద్ మహా** : జాతీయ ఆయుష్ మిషన్ పరిధిలో ఆదిలాబాద్ జిల్లాలో వివిధ విభాగాల్లో 10 ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ (పీజీ అర్హతతో) ఒకటి, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ మూడు, డైటీషియన్ ఒకటి, సైకోసోషల్ కౌన్సెలర్ (ఆన్ కాల్) ఒకటి, యోగా ప్రొఫెషనల్ ఒకటి, మల్టీ పర్పస్ వర్కర్ మూడు పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.అర్హతలు, దరఖాస్తు ఫారం, ఇతర వివరాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్ లో పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ వరకు అన్ని పని దినాల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆదిలాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.ఈ నెల 26వ తేదీ సాయంత్రం 4 గంటల తర్వాత అందిన దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేశారు. పోస్టు ద్వారా దరఖాస్తులు పంపినప్పుడు జరిగే ఆలస్యాలకు శాఖ బాధ్యత వహించదని తెలిపారు. నోటిఫికేషన్‌ను ఎప్పుడైనా రద్దు చేసే అధికారం నియామక కమిటీకి ఉంటుందని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు జిల్లా ఆయుష్ నోడల్ అధికారిని 8639785919 నంబరులో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.



# బతుకమ్మ, దసరా వేడుకల్లో అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై గట్ల సుధాకర్

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ప్రజలకు బతుకమ్మ, దసరా ముందస్తుగా శుభాకాంక్షలను ఎస్సై గట్ల సుధాకర్ తెలియజేశారు. పండుగలను ప్రజలందరూ సుఖసంతోషాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన సూచించారు. రామగుండం పరిధిలో చోటు చేసుకుంటున్న చైన్ స్నాచింగ్ ఘటనలను దృష్టిలో ఉంచుకుని, సద్దుల బతుకమ్మ రోజున మహిళలు బంగారు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు. జన సమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఆభరణాల పట్ల జాగ్రత్త వహించాలని, ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో బీరువాలు, విలువైన వస్తువులు, ఇంటి భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మైకుల ద్వారా ఎప్పటికప్పుడు గ్రామ ప్రజలకు భద్రతా జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు. పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు చోటుచేసుకోకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజలందరూ పరస్పర స్నేహభావంతో, శాంతియుత వాతావరణంలో బతుకమ్మ, దసరా పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎస్సై గట్ల సుధాకర్ విజ్ఞప్తి చేశారు.



# యాసంగిలో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

**పెద్దపల్లి మహా** : కాల్వశ్రీరాంపూర్: యాసంగి సీజన్‌లో రైతులు కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా మొక్కజొన్న, నువ్వులు, వేరుశనగ, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి అధిక దిగుబడులతో పాటు మెరుగైన లాభాలు పొందాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు సూచించారు. అలాగే అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 50 మంది లబ్ధిదారులకు రూ.50,05,800 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే విజయరమణరావు స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, అర్హతలు, ప్రభుత్వ మార్గదర్శకాల అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా విజయరమణరావు మాట్లాడుతూ.. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత రెండేళ్ల పది నెలల కాలంలో లబ్ధిదారులకు చెక్కులు అందించడంలో ఆలస్యం కాకుండా చూశామని పేర్కొన్నారు. ఈ పథకాల విషయంలో ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సోషల్ మీడియా వేదికగా అవాస్తవ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని సూచిస్తూ, మార్కెట్‌లో డిమాండ్, నేల స్వభావం, నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని అన్నారు. పంటల వైవిధ్యంతో సాగు ఖర్చులు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాపెల్లి రాముడు , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి , స్థానిక సర్పంచ్ బంగారి రమేష్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి నాయకులకు సత్కారం

**బెల్లంపల్లి మహా**: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చ, ఓబిసి మోర్చలలో వివిధ పదవులు పొందిన బిజెపి నాయకులను బిజెపి రాష్ట్ర నేత, జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి ఘనంగా సన్మానించారు. శనివారం స్థానిక బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కృష్ణ దేవరాయలు, ఉపాధ్యక్షులు ఎరుకల నర్సింగ్, ఓబిసి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు రామయ్య యాదవ్, కోయిల్కర్ గోవర్ధన్, జిల్లా కార్యదర్శి ఆకుల శంకర్ లను కొయ్యల ఏమాజి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. రాబోయే రోజుల్లో బెల్లంపల్లి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వారికి పదవులు రావడం అభినందనీయమన్నారు. అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు శనిగారపు శ్రావణ్, పట్టణ ఉపాధ్యక్షులు యుగంధర్, సీనియర్ నాయకులు రాములు, ఎస్సీ మోర్చ పట్టణ ప్రధాన కార్యదర్శి కనకం శ్రీనివాస్, రాజ్ కుమార్, గణేష్, ఆవుల రాజేశం తదితరులు పాల్గొన్నారు



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తతే రక్షణ

- వారం రోజుల్లో 24 ఫిర్యాదులు నమోదు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడి

**ఆదిలాబాద్ మహా:** ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులను నమ్మవద్దని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలో గత వారంలో మొత్తం 24 ఫిర్యాదులు నమోదయ్యాయని, వీటిలో 13 యూపీఐ మోసాలు కాగా మిగతావి వ్యక్తిగత వివరాల దొంగతనం,ఆన్‌లైన్ సేవల మోసం, క్రెడిట్ కార్డు, ఈకేవైసీ మోసం, ఆన్‌లైన్ ఆదాయం, ఉద్యోగాల పేరుతో మోసాలకు సంబంధించినవని తెలిపారు. సైబర్ నేరగాళ్లు వివిధ పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నందున ప్రతి లావాదేవీ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు



# బతుకమ్మ విగ్రహాలను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ విజయరమణారావు

**పెద్దపల్లి మహా:** కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంతో పాటు రాయపేట గ్రామంలో బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ విగ్రహాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ ప్రజల్లో ఐక్యత, సంతోషాన్ని నింపుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమం

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి గ్రామంలోని శ్రీ హనుమాన్ శివాంజనేయ ఆలయంలో దుర్గాదేవి అమ్మవారికి పూజలు నిర్వహించి ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తుల సహకారం, దాతల ఉదారతతో అన్నదాన కార్యక్రమం విజయవంతంగా జరిగింది.ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు, భక్తులకు, గ్రామ ప్రజలకు ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఓటరు నమోదు దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

- కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలు

**ఆదిలాబాద్ మహా** : ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, విచారణలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో దరఖాస్తుదారుల అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారినే ఓటర్లుగా నమోదు చేయాలని స్పష్టం చేశారు.శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, సంబంధిత అధికారులు ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఎస్ఐఆర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఫారం 6, ఫారం 7, ఫారం 8లకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, ఎలాంటి పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల అర్హతలను నిబంధనల ప్రకారం నిర్ధారించాలని, ఓటర్ల జాబితాలో తప్పులు, డూప్లికేట్ వివరాలు, అనర్హుల పేర్లు చేరకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అవసరమైన ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వాటిని సకాలంలో అందజేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందించడంతోపాటు, అవసరమైన పత్రాలను స్వీకరించాలని ఆదేశించారు. దరఖాస్తులు, విచారణలకు సంబంధించిన రికార్డులను భౌతిక పత్రాల రూపంలో సక్రమంగా నిర్వహించి భద్రపరచాలని పేర్కొన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు విషయంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుదారుల అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన అనంతరమే అర్హతను నిర్ధారించాలని, నకిలీ లేదా తప్పుడు పత్రాలు, డూప్లికేట్ దరఖాస్తులను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ అన్ని దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని, ఓటరు నమోదు, జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ నలంద ప్రియ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మందమర్రిలో బతుకమ్మ సంబరాలు

మందమర్రి, మహా : సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో శనివారం బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, సేవా సంఘం అధ్యక్షురాలు ఎన్. శ్రీవాణి రాధాకృష్ణ హాజరై, మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆటపాటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ, ప్రకృతిలో లభించే రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, పూలనే దైవంగా పూజించే గొప్ప సాంప్రదాయం తెలంగాణకే సొంతమని అన్నారు. అనంతరం సేవా సంఘం అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ మాట్లాడుతూ, బతుకమ్మ కేవలం సంబరం మాత్రమే కాదు, ఐక్యతకు, స్నేహభావానికి నిదర్శనమని, ఆడపడుచులందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, శాంతిఖని ఏజెంట్ సంతోష్ కుమార్, డీజీఎం పర్సనల్ సి.హెచ్. అశోక్, సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ పీవో సత్యనారాయణ, లేడీస్ క్లబ్ సభ్యులు లక్ష్మి రఘుకుమార్, వాసవి, పద్మప్రియ, ఏఐటీయూసీ నాయకులు సృజనగీతిక, టి. జ్యోతి, జీఎం కార్యాలయం మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



# ఎల్లమ్మ గుండమ్మ చెరువులోకి నీరు చేరే తూమును పరిశీలించిన ప్రభుత్వ విప్

**పెద్దపల్లి మహా** : పెద్దపల్లి పట్టణ శివారు ప్రాంతంలోని నిట్టూరు-నిమ్మనపల్లి రహదారిపై, పెద్దకల్వల, చీకురాయి గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న D83 కాలువ వద్ద పెద్దపల్లి ఎల్లమ్మ గుండమ్మ చెరువులోకి నీరు చేరే తూమును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా చెరువులోకి నీరు చేరేందుకు ఏర్పాటు చేసిన తూము పరిస్థితిని ఆయన పరిశీలించారు. స్థానికంగా ఉన్న సాగునీటి కాలువలు, చెరువులకు నీరు చేరే మార్గాల పరిస్థితిని తెలుసుకున్నారు. చెరువులోకి నీరు చేరే విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయనే అంశంపై స్థానిక నాయకులతో చర్చించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న కనక లక్ష్మీ తల్లి ని పరామర్శించిన

## మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**పెద్దపల్లి మహా:** ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు గుజ్జేటి కనక లక్ష్మి గారి తల్లి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెంట మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, మోహన్ రెడ్డి, పాకాల రాజయ్య, పుస్కురి రామారావు, మాజీ సర్పంచ్ కారుపాకర రాజయ్య, సత్యం, మాజీ ఉపసర్పంచ్ ఆవుల లత, కాపెల్లి అపర్ణతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరసనకు డాక్టర్ దాసరి మమతా రెడ్డి సంఘీభావం




**పెద్దపల్లి మహా** : జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు, పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్ హెచ్ఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో నిరంతరం సేవలందిస్తూ ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడంలో వారు ముఖ్యమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఎన్ హెచ్ఎం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు సానుకూలంగా పరిశీలించాలని, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, వారి హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు తమ మద్దతు, సంఘీభావం ఎల్లప్పుడూ ఉంటాయని డాక్టర్ దాసరి మమతా రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, టిఆర్ఎస్వి కోఆర్డినేటర్ కొయ్యడ సతీష్ గౌడ్, పూదరి చంద్రశేఖర్, బాలసాని శ్రీనివాస్, అడ్వకేట్ శ్యాంబాబు, గడ్డం శ్యామ్, శ్రీనివాస్, జక్కుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాతను దర్శించుకున్న మాజీ జెడ్పీటీసీ



**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: మండలంలోని మల్యాల గ్రామ శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను కాల్వ శ్రీరాంపూర్ మండల తాజా మాజీ జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, కాల్వ శ్రీరాంపూర్ మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని దుర్గామాతను ప్రార్థించినట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మల్యాల గ్రామ సర్పంచ్ బూసి సదాశివరెడ్డి, ఉపసర్పంచ్ లోనే సదయ్య, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కామిడి సంధ్య వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్రబాటి రవీందర్, జ్ఞానేంద్ర చారి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు

# అధికారులతో కలెక్టర్ ఎస్పీ సమీక్ష



**నిర్మల్ మహా**: పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. వ్యాపార సముదాయాలకు తప్పనిసరిగా పార్కింగ్ సదుపాయం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ లో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్లపై ఆక్రమణలు, పశువుల సంచారం, ఇసుక అక్రమ రవాణా తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.పార్కింగ్ సదుపాయం లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వ్యాపార సముదాయాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై పశువులను వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పశువుల కారణంగా ప్రమాదాలు, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే యజమానులకు జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే పశువులను స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారులు, మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగించాలని అధికారులను ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను 'బ్లాక్ స్పాట్లు'గా గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన హెచ్చరిక బోర్డులు, ఇతర భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు.

జాతీయ రహదారుల వెంట నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకరంగా భారీ వాహనాలను నిలిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ శాఖల నిర్మాణ పనులకు కూడా నిబంధనలకు అనుగుణంగానే ఇసుకను వినియోగించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలు (వీడీసీ) ఇసుక వేలం నిర్వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వీడీసీలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దుతాం- ఎస్పీ**

జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ తరపున అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వివిధ కేసుల్లో బాధితులకు అందాల్సిన నష్టపరిహారాన్ని త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. వ్యవసాయ, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో గంజాయి సాగు, విక్రయాలను అరికడుతున్నామని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ తెలిపారు. అనంతరం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రత్యేక పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు.అనంతరం రెవెన్యూ అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'భూభారతి', 'సీఎం ప్రజావాణి'లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, ఏఎస్పీలు సాయి కిరణ్, ఉపేంద్రా రెడ్డి, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



## దుర్గామాత ఆలయంలో పూజలు

**శ్రీరాంపూర్/ మంచిర్యాల, మహా ప్రతినిధి** : శ్రీరాంపూర్ ఏరియా ఎస్.ఆర్.పి.3 గని దుర్గామాత ఆలయంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి రఘునాథ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన హోమంలో పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం భూగర్భ బొగ్గు గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, వారి కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని దుర్గామాతను ప్రార్థించినట్లు తెలిపారు. కార్మికులందరిపై అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్రం రమేష్, కర్రె చక్రవర్తి, కాదాసు భీమయ్య, పొన్నవేణి సదయ్య, కంపెల్లి తిరుపతి, కొండ వెంకటేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి నాయకులను సన్మానించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి

**బెల్లంపల్లి, మహా**:భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చ, ఓబిసి మోర్చలలో వివిధ పదవులు పొందిన బిజెపి నాయకులను బిజెపి రాష్ట్ర నేత, జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి ఘనంగా సన్మానించారు. శనివారం రోజు స్థానిక బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సీ మోర్చ జిల్లాధ్యక్షుడు కృష్ణ దేవరాయలు, ఉపాధ్యక్షులు ఎరుకల నర్సింగ్, ఓబిసి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు రామయ్య యాదవ్,కోయిల్కర్ గోవర్ధన్, జిల్లా కార్యదర్శి ఆకుల శంకర్ లను కొయ్యల ఏమాజి శాలువాతో ఘనంగా సన్మానించారు. వారినీ అభినందించారు. రాబోయే రోజుల్లో బెల్లంపల్లి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వారిని కోరారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వారికి పదవులు రావడం అభినందనీయం అన్నారు. మీకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు శనిగారపు శ్రావణ్, పట్టణ ఉపాధ్యక్షులు యుగంధర్, సీనియర్ నాయకులు రాములు, ఎస్సీ మోర్చ పట్టణ ప్రధాన కార్యదర్శి కనకం శ్రీనివాస్, రాజ్ కుమార్, గణేష్, ఆవుల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం...

- **ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు**
- **వేగంగా దూసుకొచ్చిన కారు రెండు బైకులను ఢీకొట్టి పల్టీలు..**
- **చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన వాహనం**

**షాద్ నగర్, మహా** : షాద్‌నగర్ పట్టణ శివారులోని పరిగి రోడ్డులో గ్రానైట్ కంపెనీ సమీపంలో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రెండు బైకులను ఢీకొట్టి పల్టీలు కొడుతూ చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైకులపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికుల సమాచారం ప్రకారం.. కారు డ్రైవర్ ఉదయం మద్యం సేవించి వేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపాడు. సదరు వాహనంలో సైతం మద్యం బాటిల్ దర్శనమిచ్చింది. సర్దార్‌నగర్ వద్ద కక్కునూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రయాణిస్తున్న బైక్‌ను కారు ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. అనంతరం అదే కారు షాద్‌నగర్ వైపు దూసుకొచ్చి పట్టణ శివారులో మరో బైక్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డుపక్కన ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లి ఆగిపోయింది. ప్రమాద తీవ్రతను చూసి ప్రత్యక్ష సాక్షులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మరో బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని సైతం ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాదానికి మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, మృతుడి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి. పట్టణ శివారులో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.



## ఆర్టీసీ బస్సు ఢీకొని జొమాటో ఉద్యోగి మృతి.. మరొకరికి గాయాలు

**జవహర్‌నగర్, మహా :** ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలైన ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అంబేద్కర్‌నగర్‌కు చెందిన స్వామి (35) జొమాటో కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అంబేద్కర్‌నగర్ నుంచి దమ్మాయిగూడ వైపు మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వామి అక్కడికక్కడే మృతి చెందగా, ద్విచక్ర వాహనంపై ఉన్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడు స్వామికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రమాద సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న జవహర్‌నగర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## శ్రీ మహాలక్ష్మి రూపంలో అమ్మవారు దర్శనం...

**కుంకుమార్చన లో బారులు తీరిన భక్తులు....**

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో దేవి శరన్న నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుతున్నాయి. అందులో భాగంగా శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనం ఇచ్చారు. సామూహిక. కుంకుమ అర్చన కార్యా క్రమంలో భక్తులతో కలిసి దేవాలయం ప్రెసిడెంట్ సోమ శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి సురేష్ గుప్తా, కోశాధికారి కొండా కృష్ణయ్య గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్థం శ్రీనివాసులు గుప్తా, ఆర్యవైశ్య సంఘము సభ్యులు రంగ ప్రభాకర్ గుప్తా, విజయకుమార్ గుప్తా, బాలరాజ్ గుప్తా తది తరులు పాలొగన్నారు.



## చిలుకానగర్ శివాలయంలో వరుణ యాగం

**సమృద్ధిగా వర్షా లు కురవాలని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు**



**కుషాయిగూడ, మహా :** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పుష్కలంగా పండి, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చిలుకానగర్ శివాలయంలో వరుణ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి, వరుణ దేవుడి ఆశీస్సులతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవాలని ప్రార్థించారు. రైతులకు సాగునీరు సమృద్ధిగా అందాలని, పంటలు బాగా పండి రైతు కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రకృతి అనుకూలించి చెరువులు, కుంటలు నీటితో కళకళలాడాలని, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, బన్నాల ప్రవీణ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్య మృతిపై సమగ్ర విచారణ జరపాలి

- **శ్రీకర ఆసుపత్రి వైద్యంపై కుటుంబ సభ్యుల డిమాండ్**



**కుషాయిగూడ, మహా** : యాప్రాల్‌కు చెందిన గండు శ్రీనివాస్ యాదవ్ కుమార్తె గండు దివ్య (21) మృతిపై నిష్పక్షపాత విచారణ జరిపి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న దివ్య డెంగ్యూ జ్వరంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం పట్ల కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీఐఎల్‌లోని శ్రీకర ఆసుపత్రిలో ఆమెకు అందించిన వైద్య చికిత్స, డిశ్చార్జి చేసిన విధానం, తిరిగి ఆసుపత్రిలో చేర్పించిన అనంతరం తీసుకున్న చర్యలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అధిక జ్వరంతో బాధపడుతున్న దివ్యను తొలుత శ్రీకర ఆసుపత్రిలో చేర్పించగా, డెంగ్యూ జ్వరంగా నిర్ధారించి చికిత్స అందించారు. అక్టోబర్ 13న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. అయితే అక్టోబర్ 14న సాయంత్రం సుమారు 6 గంటలకు ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో తిరిగి అదే ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ మరింత చికిత్స అందించడం సాధ్యం కాదని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దీంతో మెరుగైన వైద్యం కోసం అక్టోబర్ 15న సాయంత్రం 5 గంటల సమయంలో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. యశోద ఆసుపత్రిలో చేర్పించిన సమయంలో దివ్య రక్తంలో చక్కెర స్థాయి 10గా ఉందని, రక్తపోటును నమోదు చేయలేని పరిస్థితి ఉందని, రక్తంలో ఇన్ఫెక్షన్ ఉన్నట్లు తమకు సమాచారం అందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ అక్టోబర్ 16న తెల్లవారుజామున 5.30 గంటలకు దివ్య గుండె ఆగిపోవడంతో మృతి చెందిందని పేర్కొన్నారు. దివ్య ఆరోగ్య పరిస్థితి క్షీణించడానికి కారణాలేమిటి, వ్యాధి తీవ్రతను సకాలంలో గుర్తించారా, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించారా, డిశ్చార్జి చేసే సమయంలో ఆమె ఆరోగ్య పరిస్థితిని పూర్తిస్థాయిలో అంచనా వేశారా, మరో ఆసుపత్రికి తరలించే నిర్ణయం సరైన సమయంలో తీసుకున్నారా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీకర ఆసుపత్రిలో అందించిన వైద్య చికిత్సకు సంబంధించిన రికార్డులు, పరీక్షల నివేదికలు, డిశ్చార్జి వివరాలను పరిశీలించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. వైద్య నిర్లక్ష్యం జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ కుమార్తెను కోల్పోయిన బాధ వర్ణనాతీతమని, దివ్యను తిరిగి తీసుకురాలేకపోయినా ఆమె మృతికి దారితీసిన పరిస్థితులపై నిజాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దివ్యకు న్యాయం చేయాలనే డిమాండ్‌కు కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రజాస్వామ్యవాదులు, న్యాయం కోరుకునే పౌరులు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.



## దుర్గా మాత ఆలయంలో అమ్మవారికి ఘనంగా ప్రత్యేక పూజలు

- **అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన**
- **ప్రజా గాయకులు. రచయిత దామరపల్లి నర్సింహారెడ్డి**

**కుషాయిగూడ, మహా** : సోనియా గాంధీ నగర్ కాలనీలో కొలువు దీరిన శ్రీ దుర్గా మాత అమ్మవారి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ప్రజా గాయకులు తామరపల్లి నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. దామరపల్లి నర్సింహారెడ్డి అమ్మవారికి పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా దామరపల్లి నర్సింహారెడ్డి మాట్లాడుతూ, శ్రీ దుర్గా మాత అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. దైవభక్తి, ఆధ్యాత్మికత మనిషికి మానసిక ప్రశాంతతను అందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. దేవి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అమ్మవారి కృపతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని కోరుకున్నారు.





## ఘనంగా 'మన ఆరోగ్య కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్' ప్రారంభోత్సవం

**కుషాయిగూడ, మహా :** నాగారం రెణుక ఎల్లమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన 'మన ఆరోగ్య కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్' కార్యక్రమం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సహజ సిద్ధమైన పద్ధతుల్లో, సంప్రదాయ విధానంతో తయారు చేసే నాణ్యమైన కోల్డ్ ప్రెస్డ్ నూనెలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి గారు, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ గారు, గూడూరు ఆంజనేయులు గౌడ్ గారు, మెరుగు శ్రీనివాస్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేటి రోజుల్లో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, రసాయనాలు కలపకుండా సహజసిద్ధమైన పద్ధతుల్లో తయారు చేసే నూనెల వినియోగం పట్ల అవగాహన పెరగడం అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ సంస్థ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలకు అందుబాటులో నాణ్యమైన కోల్డ్ ప్రెస్డ్ నూనెలను అందించేందుకు ముందుకు వచ్చిన 'మన ఆరోగ్య కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్' యాజమాన్యాన్ని వారు అభినందించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## గణేష్ నగర్ కాలనీలో నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న చిన్నారులు

**భక్తి గీతాలతో అలరించిన గాయకులు**

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్ కాలనీలో శ్రీ దుర్గా మాత ఆలయం వద్ద.నాట్య గురువు కీసరి రామలక్ష్మి శిష్య బృందం అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకుని, అందరి ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా ఐదేళ్ల చిన్నారి శాన్విక తన నృత్య ప్రతిభతో అందరినీ ఆశ్చర్యపరిచింది. చిన్న వయసులోనే ఎంతో ఆత్మవిశ్వాసంతో నృత్యం చేసి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొంది. గాన కళాకారుడు శ్రీనివాస్ చారి బృందం ఆలపించిన భక్తి గీతాలు కాలనీవాసులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. భక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలతో కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగగా, కళాకారుల ప్రతిభను కాలనీవాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గణేష్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బాల కృష్ణ చారి, జమాల్ వెంకన్న, వెంకటేష్ గౌడ్, జానీ, దుర్గమ్మ భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## దేవి నవరాత్రుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు

**అన్నప్రసాద వితరణలో పాల్గొన్న ఎమ్మెల్యే**

**కుషాయిగూడ, మహా :** దేవి నవరాత్రుల పర్వదినాలను పురస్కరించుకొని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్ చిలుక నగర్ సింగం తండా లో అమ్మవారి కి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. దేవి నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యతకు ప్రతీకలని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని బండారు లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేగళ్ల సతీష్ రెడ్డి జన్మదినం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకలు

**ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ**

**కుషాయిగూడ, మహా :** బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రేగళ్ల సతీష్ రెడ్డి జన్మదినం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకగా బట్టల పంపిణీ కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్మికులకు బట్టలు పంపిణీ చేసి, కేక్ కట్ చేసి సతీష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, బోధస్ లక్ష్మీనారాయణ. బైరి నవీన్ కుమార్ గౌడ్. ఇంద్రయ్య. ఎం కె. బద్రుద్దీన్. మాజీ కార్పొరేటర్ లు కొత్త రామారావు. సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి. పన్నాల దేవేందర్ రెడ్డి. పజూరి పావని మణిపాల్ రెడ్డి కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## శ్రీ దేవి నవరాత్రి పూజలో పాల్గొన్న బిఆర్ఎస్ నేత బండారు నీలం రెడ్డి

**కుషాయిగూడ, మహా** : మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అశోక్ నగర్. నెహ్రూ నగర్ కాలనీలలో ఆయా కాలనీల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు. సంఘసంస్కర్త. బండారు నీలం రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు నీలం రెడ్డి.మాట్లాడుతూ, దుర్గాదేవి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ మంచి జరగాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని,భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు బండారు నీలం రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు.



## పేకాట స్థావరంపై పోలీసుల దాడి..

**పెద్దపల్లి మహా:** గోదావరిఖని:రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ జూదంపై పోలీసులు చర్యలు చేపట్టారు. నార్కోటిక్/టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐ దీకొండ రమేష్, సిబ్బంది గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,850 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.



## శేషగిరినగర్‌లో రూ.15 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం..

- **మినీ ఫంక్షన్ హాల్, సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం..**
- **వైద్య చికిత్సకు రూ.3 లక్షల ఎల్ఓసీ అందజేత**

**మణుగూరు, మహా :** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరినగర్‌లో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. హనుమాన్ ఆలయం వద్ద రూ.10 లక్షలతో నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్‌ను, రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మినీ ఫంక్షన్ హాల్ స్థానికులు వివాహాలు, శుభకార్యాలు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందని, సీసీ రోడ్డు నిర్మాణంతో రాకపోకల ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అభివృద్ధి పనులు అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధి రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన మద్దెల సంతోష వైద్య చికిత్స నిమిత్తం రూ.3 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సకు ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైద్య సహాయానికి సహకరించిన ఎమ్మెల్యేకు సంతోష కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, పట్టణ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావంతో జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- **ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి, సీడీఎంఏ డాక్టర్ టి కె శ్రీదేవి**
- **ముందస్తు చర్యలపై ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్**




**హనుమకొండ, మహా;** ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజుల్లో ఏర్పడే సమస్యల పట్ల జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, సిడిఎంఏ డాక్టర్ టి. కె. శ్రీదేవి ఆదేశించారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు) కు చెందిన కలెక్టర్లతో ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, వర్షపాత పరిస్థితులు, తాగునీటి లభ్యత, వ్యవసాయం, సాగునీరు, విద్యుత్ సరఫరా, పశుసంపద, ప్రజారోగ్య పరిరక్షణ తదితర అంశాలపై ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, సిడిఎంఏ డాక్టర్ టి. కె.శ్రీదేవి సమీక్షించారు. వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టరేట్ల లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్స్ నుండి జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్ పాయి, అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, సి డి ఎం ఎ డాక్టర్ టి. కె.శ్రీదేవి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం కారణంగా జిల్లాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. నీటి కొరత ఏర్పడక ముందే అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాల్లో తాగునీటి వనరులు, రిజర్వాయర్లు, చెరువులు, భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నీటి నిల్వలు తగ్గే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలనిప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ బోర్లు, ట్యాంకర్లు, ఇతర నీటి సరఫరా ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. తాగునీటి అవసరాలకు ఆటంకం కలగకుండా సాగునీటి వినియోగాన్ని నియంత్రించాలని, నీటి వృథాను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రాబోయే రబీ సీజన్‌లో తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరి సాగుపై ఆధారపడకుండా శనగలు, కందులు, పెసలు, ఇతర పప్పుధాన్యాలు, నూనెగింజల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన విత్తనాలను రాయితీపై అందుబాటులో ఉంచేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రైతులకు పంటల మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని, నేలలు, వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత ఆధారంగా పంటల ఎంపికపై వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో పశువులకు పశుగ్రాసం, తాగునీటి కొరత ఏర్పడకుండా పశుసంవర్ధక శాఖ అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో పశుగ్రాసం నిల్వలు, సరఫరా ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని, అవసరమైన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అదే సమయంలో గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సంస్థల్లో విద్యుత్ ను పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా, మండలం, గ్రామపంచాయతీ స్థాయిలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సీడీఎంఏ ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి తాగునీరు, వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, పశుగ్రాసం, ప్రజారోగ్యం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించాలని సూచించారు. విద్యుత్ సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. భవనాల పైకప్పుల పై కూల్ రూఫ్స్ ఏర్పాటు చేయడం ద్వారా ఉష్ణోగ్రతలను తగ్గించడంతోపాటు విద్యుత్ వినియోగాన్ని కూడా గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడే ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు అవసరమైన మౌలిక సేవలు నిరంతరాయంగా అందేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని డా. టి.కె. శ్రీదేవి స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావం వల్ల జిల్లాల్లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు వివరించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా జిల్లాలో రానున్న రోజుల్లో ఏర్పడే సాగు, త్రాగు నీటి ఎద్దడి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణతో సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వ్యవసాయం, నీటిపారుదల, విద్యుత్, వైద్య ఆరోగ్య,మొదలగు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకున్నట్లు సూచించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యత, భూగర్భ జలాల మట్టం, చెరువుల నీటి నిల్వలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నీటి కొరత ఏర్పడే అవకాశమున్న గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రాబోయే రబీ సీజన్‌లో తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను రైతులు ఎంచుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల వారీగా ప్రస్తుతం తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేనప్పటికీ, భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని సాగునీటి వినియోగాన్ని అందుబాటులో ఉన్న నీటి నిల్వలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్లు స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితుల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. వీసీ అనంతరం కలెక్టర్లు సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ..... ఎల్ నీనో ప్రభావం వల్ల ఏర్పడే పరిస్థితులని సమర్థవంతంగా ఎదురుకునేందుకు తీసుకోవలసిన తగు చర్యల పైన దిశా నిర్దేశం చేశారు.. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, ఈ ఈ రవి కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా సాగునీటిపారుదల శాఖ అధికారి రామ్మోహన్, విద్యుత్ శాఖ ఏడీఈ గంగారెడ్డి, భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శైలశ్రీ మల్లికా దేవి, ఆర్డబ్ల్యూఎస్ డీజీ మధు, తదితరులు పాల్గొన్నారు.



## పీవీ నరసింహారావు ఎక్స్ప్రెస్ వే పై నిర్లక్ష్యం కారణంగా ఐదు వాహనాలు ఢీ...

భారీగా ట్రాఫిక్ జాం...రాజేంద్రనగర్ మహా ; పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్వేపై ఐదు కార్లు ఒకదానికి ఒకటి వరుసగాఢీకొని డ్యామేజ్ అయ్యాయిన ఘటన రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. మెహదీపట్నం నుంచి ఆరాంఘర్ వైపు వస్తున్న పివి ఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపైన పిల్లర్ నంబర్ 131 సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మొదట ఓ కారు డివైడర్ లో ఉన్న స్తంభాన్ని ఢీకొట్టడంతో వెనుక నుంచి వస్తున్న మరో నాలుగు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో ఐదు కార్లు పాక్షికంగా డ్యామేజ్ అయ్యాయి. వరుసగా ఐదు కార్లు ఢీకొనడంతో పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్వేపై భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు, ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన ఐదు వాహనాలను క్రేన్ సహాయంతో తొలగించారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్పంగా గాయాలయ్యాయి. దాదాపు గంట పైగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. పీవీ నరసింహారావు ఎక్స్ప్రెస్ వే పై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉంటు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ బోసు కిరణ్ తెలిపారు.



## అక్రమ నిర్మాణాల కూల్చివేతలో అధికారులను అడ్డుకున్న నాయకులు

**కూల్చివేతలు నిలిపివేసి వెనుదిరిగిన అధికారులు**

**రాజేంద్రనగర్ మహా ;** అక్రమ నిర్మాణాలకు కూల్చివేతలకు వెళ్లిన టౌన్ ప్లానింగ్ అధికారులను స్థానికులతో కలిసి బిఆర్ఎస్ నాయకులు. అడ్డుకున్నారు. గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని మధురానగర్ లో 111 జీవోకు విరుద్ధంగా ఎలాంటి అనుమాత్రులు లేకుండా భారీ బౌల అంతస్తులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. భవనాలను కూల్చివేసేందుకు కొన్ని రోజుల క్రితమే నోటీసులు అందజేశారు. శనివారం భారీ పోలీసు బంధవస్తు మధ్య టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్ తన సిబ్బందితో కలిసి కూల్చివేతలకు వెళ్లారు. కూల్చివేతల మొదలు పెట్టగానే స్థానికులు బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి టౌన్ ప్లానింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. శంషాబాద్ అభివృద్ధికి టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో స్థానిక నాయకులు పరుష పదజాలాలతో దూషిస్తూ పైపైకి వెళ్లారు.శంషాబాద్ లో భూములు కోల్పోయాం, ఇంటి నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డు తగులుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఒకరినొకరు తోసుకున్నారు. అక్కడ ఉన్న పోలీసులు ఏమీ చేయలేని పరిస్థితి లో నిలుచున్నారు. చివరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడి నుంచి పనులు ఆపేసి వెనుదిరిగారు. తమ విధులకు ఆటంకం కలిగించారు. నాయకులు అడ్డుకొని తీవ్ర పదజాలంతో దూషించడం బాధాకరమని టౌన్ ప్లానింగ్ అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు.

## అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించిన అధికారులు.!

- **ఆదిబట్ల సర్కిల్–15లో అక్రమ నిర్మాణాల తొలగింపు**
- **నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు**
- **ఆదిబట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి**

**ఆదిభట్ల అక్టోబర్ 17 మహా:** జీహెచ్ఎంసీ ఆదిబట్ల సర్కిల్-15 పరిధిలో భవన నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్, ఆదిబట్ల పరిధిలో స్టిల్ట్ +2 అంతస్తులకు మాత్రమే అనుమతి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన 3, 4వ అంతస్తుల అక్రమ నిర్మాణాలను ఆదిభట్ల టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం తొలగించారు. భవన నిర్మాణదారులు మంజూరైన ప్లాన్‌కు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఆదిభట్ల డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించవద్దని, నిర్మాణానికి ముందు అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని ప్రజలకు ఆయన సూచించారు.



## ఆయుష్ శాఖలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల, మహా ప్రతినిధి : ఆయుష్ శాఖ పరిధిలో పొరుగు సేవల పద్ధతిన వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఆయుష్ నోడల్ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి. మెడికల్ ఆఫీసర్ 4, ఫార్మసిస్ట్ 1, సైకోసోషల్ కౌన్సిలర్ 1, యోగ ప్రొఫెషనల్ 1, మల్టీ పర్పస్ వర్కర్ 3 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హతలు : మెడికల్ ఆఫీసర్ కు ఆయుర్వేదం/యునాని/హోమియో/నేచురోపతిలో డిగ్రీ + ఇంటర్న్ షిప్, ఫార్మసిస్ట్ కు డి.ఫార్మసీ/బి.ఫార్మసీ/ఫార్మాడి + తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ నమోదు, సైకోసోషల్ కౌన్సిలర్ కు సోషల్ వర్క్ లో మాస్టర్స్, యోగ ప్రొఫెషనల్ కు సంబంధిత డిప్లొమా, ఎం.పి. డబ్ల్యూ. కు 7వ తరగతి ఉత్తీర్ణత + సైకిల్ నడపగలగాలని వివరించారు.అర్హులైన అభ్యర్థులు ఈ నెల 22 నుంచి 27 వరకు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఎం.పి. డబ్ల్యూ.పోస్టులకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన 28న సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉంటుందని తెలిపారు. ఎంపిక మార్కులు, వెయిటేజీ, రిజర్వేషన్ ఆధారంగా ఉంటుందని పేర్కొన్నారు.




## గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ భేష్..!

- **ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు**
- **బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి**

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 17 మహా:** బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం స్థాయిలో నాలుగు మండలాల క్రీడాకారులచే, ఈనెల 11 నుంచి 16 వరకు నిర్వహించిన, ఈ యొక్క క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను విజయదశమి పండుగ సందర్భంగా, బి. సాయికీర్తన్ రెడ్డి లెగసి ట్రస్ట్ బి.ఆర్.ఆర్. ఫౌండేషన్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ నిర్వహించడం జరిగింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రత్యేక పురస్కారం అందించడం జరిగింది. బిఆర్ఆర్ చైర్మన్ రామ్ రెడ్డి మాట్లాడుతూ... యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడం, యువతలో ఐక్యత, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ టోర్నమెంట్ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. బిఆర్ఆర్ ఫౌండేషన్ ఇబ్రహీంపట్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యొక్క క్రికెట్ ప్రీమియర్ లీగ్ ద్వారా నాలుగు మండలాల క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి వేదిక లభించిందన్నారు. పెద్ద సంఖ్యలో జట్లు పాల్గొనడం, ఉత్సాహభరితంగా పోటీలు జరగడం ఈ టోర్నమెంట్ విజయవంతానికి నిదర్శనం అని ఆయన కొనియాడారు. క్రీడల అభివృద్ధికి, యువత ప్రోత్సాహానికి బిఆర్ఆర్ ఫౌండేషన్ చేస్తున్న ఈ కృషి అభినందనీయం అని ప్రశంసించారు.

# మంత్రి ఆదేశాలను బేఖాతర్..!

- **జిల్లా అటవీ అధికారుల అత్యుత్సాహం.. దసలి పంటల ధ్వంసం**
- **120 మంది రైతులకు 9 లక్షల రూపాయలు నష్టం**



**కోటపల్లి /మంచిర్యాల, మహా ప్రతినిధి** : తెలంగాణ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద ఆదేశాలను సైతం అటవీ అధికారులు బేఖాతర్ చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కోరితే బాపు, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల పున్నం ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం కోటపల్లి మండలం కావర్ కొత్తపల్లి గ్రామంలో ఆదివాసిలు సాగు చేస్తున్న పట్టుపురుగుల పెంపకం పై విరుచుకుపడి పంట నష్టం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కోటపల్లి మండలంలో సుమారు 120 మంది ఆదివాసి రైతులు 200 ఎకరాల్లో దసలి (తసర్) పట్టు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని వెల్లడించారు. అయితే ఈ పంటను అటవీ అధికారులు దశలవారీగా ధ్వంసం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంపై 10 రోజుల్లో రెండుసార్లు మంత్రి వివేకానంద ను కలిసి గోడు తమ వెల్లబోసుకున్నామని పేర్కొన్నారు. తక్షణమే స్పందించి మంత్రి రైతుల సమక్షంలోనే డీఎఫ్ఓ తో మాట్లాడి పంటలను ధ్వంసం చేయవద్దని ఆదేశించారని తెలిపారు.అయితే ఇది జరిగిన మూడు రోజులకే మంత్రి మాటను బేఖాతర్ చేస్తూ శుక్రవారం శనివారం రైతులు లేని సమయంలో పంటలను ధ్వంసం చేశారని, దీనివల్ల సుమారు రైతులకు 9 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లిందని వారు ఆరోపించారు. ఇప్పటికైనా బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకొని ఆదివాసీలను ఆదుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆదివాసీల మందిరం ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొంక మహేష్, ఆలం గంగక్క, కొంక లక్ష్మి, ఆలం అఖిల, కోడిపే శ్రీనివాస్ తదితర రైతులు పాల్గొన్నారు.

# చీరకట్టులో ఐశ్వర్య మీనన్

హైదరాబాద్: దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ఐశ్వర్య మీనన్ మరోసారి తన అందమైన సంప్రదాయ రూపంతో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆధునిక దుస్తుల్లోనే కాకుండా సంప్రదాయ వస్త్రధారణలోనూ ఎంతో అందంగా కనిపిస్తూ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆమె చేసిన ఫొటోషూట్‌లో పట్టుచీరలో మెరిసిపోతూ కనిపించారు. ఈ ఫొటోల్లో ఐశ్వర్య రూపం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సంప్రదాయ దుస్తులకు ఆధునిక శైలిని జోడిస్తూ తనదైన ఫ్యాషన్ అభిరుచిని చాటుకున్నారు. ఐశ్వర్య ధరించిన పట్టుచీరలో నారింజ, ఆకుపచ్చ రంగుల కలయిక ప్రత్యేకంగా కనిపిస్తోంది. చీరకు ఉన్న బంగారు అంచులు ఆమె రూపానికి మరింత నిండుదనాన్ని తీసుకొచ్చాయి. చీర రంగులు, అంచుల అందం, ఆభరణాల ఎంపిక అన్నీ కలిపి ఆమెను సంప్రదాయ సౌందర్యానికి ప్రతిరూపంగా నిలిపాయి. ముఖ్యంగా భారతీయ వస్త్రధారణను ఇష్టపడేవారికి ఈ లుక్ మంచి ఫ్యాషన్ ప్రేరణగా నిలుస్తోంది. చీరకట్టుకు సరిపోయేలా బంగారు ఆభరణాలను ఎంచుకోవడం ఈ ఫొటోషూట్‌లో మరో ప్రత్యేకత. నుదుటిపై బొట్టు, చక్కగా అలంకరించిన జడ, అందమైన ముఖకవళికలు ఆమె రూపానికి మరింత ఆకర్షణను అందించాయి. అతిగా అలంకరణకు ప్రాధాన్యం ఇవ్వకుండా చీర అందాన్ని ప్రధానంగా చూపించే విధంగా మొత్తం రూపాన్ని తీర్చిదిద్దారు. సంప్రదాయ శైలిలోనూ హుందాగా, ఆకర్షణీయంగా కనిపించవచ్చని ఐశ్వర్య తన ఫొటోల ద్వారా చూపిస్తున్నారు. ఈ ఫొటోషూట్‌కు ఎంచుకున్న నేపథ్యం కూడా ప్రత్యేకంగా కనిపిస్తోంది. పచ్చదనం, పాతకాలపు నిర్మాణ శైలి కనిపించే పరిసరాల్లో తీసిన చిత్రాలు సహజమైన అందాన్ని ప్రతిబింబిస్తున్నాయి. సంప్రదాయ దుస్తులకు అనుగుణంగా నేపథ్యాన్ని ఎంపిక చేయడంతో ఫొటోలకు మరింత అందం వచ్చింది. దుస్తులు, ఆభరణాలు, హెయిర్ స్టైల్, ఫొటోగ్రఫీ మధ్య చక్కటి సమన్వయం కనిపిస్తోంది. అందుకే ఈ చిత్రాలు ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఐశ్వర్య మీనన్ సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే ఆమె తమిళ చిత్ర పరిశ్రమ ద్వారా నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం కన్నడ, మలయాళం, తెలుగు చిత్రాల్లోనూ నటిస్తూ దక్షిణాది ప్రేక్షకులకు చేరువయ్యారు. విభిన్న భాషల్లో సినిమాలు చేస్తూ తన నటనా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. 2023లో విడుదలైన తెలుగు చిత్రం స్పైలోనూ ఆమె నటించారు. నటనతో పాటు ఫొటోషూట్లు, ఫ్యాషన్ ఎంపికలతోనూ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. సినీ తారల వస్త్రధారణను అనుసరించే అభిమానులకు ఐశ్వర్య తాజా లుక్ మంచి ఆలోచనగా నిలుస్తోంది. ముఖ్యంగా పండుగలు, పెళ్లిళ్లు, కుటుంబ వేడుకల కోసం సంప్రదాయ చీరలను ఎంచుకునేవారు ఈ తరహా రంగుల కలయికను పరిశీలించవచ్చు. పట్టు చీరకు సరిపోయే ఆభరణాలు, సాధారణమైన హెయిర్ స్టైల్, బొట్టు వంటి చిన్న అంశాలు మొత్తం రూపానికి ప్రత్యేకమైన అందాన్ని తీసుకొస్తాయి. ఆధునిక ఫ్యాషన్ ఎంతగా మారుతున్నా సంప్రదాయ చీరలకు ఉన్న ఆదరణ మాత్రం కొనసాగుతూనే ఉంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వస్త్రధారణకు ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుందని ఐశ్వర్య మీనన్ తాజా ఫొటోషూట్ మరోసారి గుర్తు చేస్తోంది. మొత్తంగా సంప్రదాయ చీరకట్టులో ఐశ్వర్య మీనన్ అందంగా కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. ఆమె ఎంపిక చేసుకున్న రంగులు, ఆభరణాలు, సహజమైన అలంకరణ ఈ ఫొటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



# ‘జైలర్ 2’ కోసం భారీ రిస్క్.. అసలు కారణం చెప్పిన నాగవంశీ!

హైదరాబాద్: సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన ‘జైలర్ 2’ సినిమా తెలుగు రాష్ట్రాల్లో మంచి ఆదరణ సొంతం చేసుకుంటుండటంతో సినీ వర్గాల్లో ఈ మూవీ బిజినెస్‌పై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ థియేట్రికల్ హక్కులను ప్రముఖ నిర్మాత, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ భారీ మొత్తానికి దక్కించుకున్నారు. అయితే ఇంత పెద్ద మొత్తాన్ని వెచ్చించి ఈ సినిమాను ఎందుకు కొనుగోలు చేశారనే విషయంపై తాజాగా ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్‌పై ఉన్న నమ్మకమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని నాగవంశీ వెల్లడించారు. భారీ బడ్జెట్ సినిమాల పంపిణీలో రిస్క్ సహజమే అయినప్పటికీ, కథను తెరకెక్కించే దర్శకుడి ప్రతిభపై నమ్మకం ఉంటే ముందుకు వెళ్లవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో రజనీకాంత్ నటించిన ‘కూలీ’ సినిమాను సుమారు రూ.42 నుంచి రూ.43 కోట్ల స్థాయిలో కొనుగోలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ‘జైలర్ 2’ విషయంలోనూ తాను భారీ ధర చెల్లించానని నాగవంశీ తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టడం వెనుక లెక్కలు ఉన్నాయని, ముఖ్యంగా దర్శకుడు నెల్సన్ పనితీరుపై తనకు గట్టి నమ్మకం ఉందని వివరించారు. ‘జైలర్’ మొదటి భాగం ప్రేక్షకులను ఆకట్టుకోవడం, రజనీకాంత్‌కు ఉన్న విపరీతమైన క్రేజ్, అనిరుధ్ రవిచందర్ సంగీతం ఈ సీక్వెల్‌పై అంచనాలను పెంచాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉంటే, నెల్సన్ దిలీప్‌కుమార్‌తో భవిష్యత్తులో ఓ తెలుగు సినిమా చేయాలని కూడా నాగవంశీ భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయంపై తాను ఇప్పటికే దర్శకుడితో మాట్లాడినట్లు తెలిపారు. ప్రస్తుతం నెల్సన్ రజనీకాంత్, కమల్ హాసన్ వంటి అగ్ర నటులతో సంబంధం ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాల్సి ఉందని, ఆ పనుల అనంతరం తెలుగు సినిమా చేసే అవకాశం ఉందని నాగవంశీ ఆశాభావం వ్యక్తం చేశారు. నెల్సన్‌తో సినిమా చేయాలనే ఆలోచన తనకు ఎప్పటి నుంచో ఉందని, ఆయన దర్శకత్వ శైలి, కథను ఆసక్తికరంగా నడిపించే విధానం తనకు నచ్చుతాయని ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. ‘జైలర్ 2’కు తెలుగు రాష్ట్రాల్లో లభిస్తున్న స్పందన పట్ల నాగవంశీ సంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు చెబుతున్నాయి. ఈ సినిమా హక్కులను అధిక ధరకు కొనుగోలు చేసిన సమయంలో కొందరు దీనిని పెద్ద రిస్క్‌గా భావించినప్పటికీ, ప్రేక్షకుల ఆదరణతో తన నిర్ణయం సరైనదిగా మారుతుందనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. అయితే సినిమా తుది వసూళ్లు, పంపిణీదారులకు వచ్చే లాభాలు పూర్తిస్థాయి బాక్సాఫీస్ లెక్కలు వెల్లడైన తర్వాతే స్పష్టమవుతాయి. మొత్తంగా ‘జైలర్ 2’ తెలుగు హక్కుల కొనుగోలు వెనుక ఉన్న కారణాలను నాగవంశీ వివరించడం, భవిష్యత్తులో నెల్సన్‌తో తెలుగు సినిమా చేసే అవకాశాన్ని ప్రస్తావించడం ఇప్పుడు టాలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతున్నాయి. రజనీకాంత్ క్రేజ్‌తో పాటు దర్శకుడు నెల్సన్‌పై ఉన్న నమ్మకంతో నాగవంశీ వేసిన ఈ అడుగు ఎలాంటి ఫలితాన్ని అందిస్తుందో చూడాలి.




### పవన్ కళ్యాణ్‌తో ‘బద్రి’ జ్ఞాపకాలు..

# రేణూ దేశాయ్ పోస్ట్‌పై ఆసక్తి!

**హైదరాబాద్:** నటి రేణూ దేశాయ్ మరోసారి తన పాత జ్ఞాపకాలతో వార్తల్లో నిలిచారు. పవన్ కళ్యాణ్ హీరోగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘బద్రి’ సినిమా తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికీ ప్రత్యేకమే. ఈ చిత్రంతోనే రేణూ దేశాయ్ తెలుగు సినీ పరిశ్రమలో హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పాత ఫొటోను పంచుకోవడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అప్పటి రోజులను గుర్తుచేసే ఈ చిత్రం సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. ‘బద్రి’ సినిమా పవన్ కళ్యాణ్ కెరీర్‌లో కీలకమైన చిత్రంగా నిలవడంతో పాటు రేణూ దేశాయ్ సినీ ప్రయాణంలోనూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఈ సినిమాలోని పాటలు, ప్రేమ సన్నివేశాలు అప్పట్లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సినిమా విడుదలై ఎన్నో సంవత్సరాలు గడిచినా, అందులోని జ్ఞాపకాలు అభిమానులకు ఇప్పటికీ గుర్తుండిపోయాయి. రేణూ దేశాయ్ పంచుకున్న పాత ఫొటోతో మరోసారి ఆనాటి సినిమా విశేషాలు చర్చకు వస్తున్నాయి. అయితే ఆమె పోస్ట్ వెనుక ప్రత్యేక ఉద్దేశం ఉందని భావించడానికి ఆధారాలు లేవు.








# ఆ ఒక్క ఫోన్ కాల్‌తో మారిపోయిన జీవితం..

### ‘గరివిడి లక్ష్మి’ దర్శకుడి భావోద్వేగ కథ!

హైదరాబాద్: జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగితే విజయం సాధించవచ్చని నిరూపించారు ‘గరివిడి లక్ష్మి’ దర్శకుడు గౌరీ నాయుడు జమ్ము. ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ బుర్రకథ కళాకారిణి గరివిడి లక్ష్మి జీవితాన్ని వెండితెరపైకి తీసుకొచ్చేందుకు ఆయన చేసిన ప్రయత్నం వెనుక ఎన్నో ఇబ్బందులు ఉన్నాయి. ఈ కథను సినిమాగా తెరకెక్కించేందుకు పలు నిర్మాణ సంస్థలను సంప్రదించినా, మహిళా ప్రధాన చిత్రమనే కారణంతో కొందరు ఆసక్తి చూపించలేదు. చివరకు పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి కథ చెప్పి సమాధానం కోసం ఎదురుచూశారు. దాదాపు రెండు నెలలైనా స్పందన రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. ఆ సమయంలో గరివిడి లక్ష్మి ఇచ్చిన ధైర్యంతో శ్రీకాకుళంలోని రాజులమ్మ తల్లి ఆలయానికి వెళ్లారు. దర్శనం ముగించుకుని తిరిగి వస్తుండగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి ఫోన్ వచ్చింది. కథకు ఆమోదం తెలిపి సినిమా నిర్మించేందుకు ముందుకొచ్చారని చెప్పడంతో ఇద్దరూ భావోద్వేగానికి గురయ్యారు. తన జీవితంలో ఆ ఫోన్ కాల్ మర్చిపోలేని మలుపు అని గౌరీ నాయుడు తెలిపారు. ఆనంది ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మాతలు. ఈ సినిమా తన కలను నిజం చేసిందని దర్శకుడు ఆనందం వ్యక్తం చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com